

# మిసిమి

మాస పత్రిక

జూన్-2004




రూ. 8/-



చిత్రకారుడు : రినీ మాగ్రిటీ (1898 - 1967)

(వివరాలు 239వ పేజిలో)



ప్రేమికులు

# మిసిమి

"All that we are is the product of what we have thought"
is "We are what we think." - Dammapada.

సంపుటి 15 | జూన్ 2004 | సంచిక 6

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

రుడ్యార్డ్ కిప్లింగ్ — మూలం : సి.డి. విర్సెన్, అనువాదం: బి.వి. రామిరెడ్డి

అధివాస్తవికత – విసుర్తున్న సరికొత్త సవాలు — గూడ శ్రీరాములు

వంటిల్లు ఒక ప్రయోగశాల – వంట చేయడం ఒక కళ — డా॥ చాగంటి కృష్ణకుమారి

కలలోనే ఒక మెళుకువ – ఆ మెళుకువలో ఒక కల – మాగ్రెటీ చిత్రకళ — కాంద్రేగుల నాగేశ్వరరావు

రెండు భిన్నధోరణులు — అబ్బూరి ఛాయాదేవి

ప్రపంచ సోషల్ ఫోరం ఎందుకు? — బి. చంద్రశేఖర్

''నవయుగాల బాట''గా రూపొందిన ''నార్లవారి మాట'' — రావెల సాంబశివరావు

సమసమాజంలో మానవాత్మ — మూలం : ఆస్కార్ వైల్డ్, అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

విడిప్రతి రూ. 8/-    వార్షిక చందా రూ. 100/-    విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **మనుష్య కుమారుడు**

చిత్రకారుడు : **మాగ్రెటీ**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20: Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# QUIZ ??

AL Gore didn't win the US presidential elections and couldn't become America's first "green" President. But the environment is still on the agenda as articles about whether the West should cut down on fossil fuel consumption and save little islands from disappearing under the oceans are appearing every day. What is the Greenhouse Effect and what are CFCs? This quiz is on environmental issues - not very glamorous perhaps, but still quite important. See what you can make of it. If you get less than 10 points, you probably think "greening" is about applying a coat of green paint. If you get anything between 11 and 15, you're quite an expert on issues like the melting of the ice-caps. Anything more, you're a crusader.

**THE ENVIRONMENT FELLOW TRAVELLER** (one point for every correct answer)

1. What atmospheric feature are CFCs or chlorofluorocarbons destroying?
2. What kind of illness will increase if CFCs continue to be "active"?
3. The USA is the world's largest emitter of carbon dioxide. Which country comes second?

**GREEN ENTHUSIAST** (two points for every correct answer)

4. Which Third World country is increasing efforts to develop wind power and is now the world's fifth largest wind power producer with an installed capacity of nearly, 1,000 megawatts?
5. Nearly two decades ago, Jayaprakash Nagar was destroyed by a man-made environmental catastrophe. Where?
6. Researchers in the mid-'80s came up with some potentially devastating results. They found the level of harmful chemicals in breast milk of tribal women in the Canadian Arctic to be higher than most other parts of the world. Name the tribe.
7. Half the forests that covered the earth are gone. Millions of hectares of tropical forests are being destroyed every year. How many million?

**GREEN CRUSADER** (three points for every correct answer)

8. The USA had imposed an embargo on Mexico under the Marine Mammal Protection Act, preventing export into the USA of a certain kind of fish. What fish and why ?
9. The development of the ozone hole was reported in May 1985 by a team of British scientists in which magazine?
10. Which country imports rhino horn for use in the handles of traditional daggers called jambiyas?

Answers go to Page No. 241

*(Courtesy By The Stateman)*

# రుడ్యార్డ్ కిప్లింగ్

## (1907వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారోపన్యాసం)

మూలం : సి.డి. విర్సెన్ అనువాదం: బి.వి.రామిరెడ్డి
శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడెమి.

ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారానికి అర్హులైన సాహిత్యకారుల పేర్లు చాలా వొచ్చాయి. ఆ వచ్చిన పేర్లలో పరిశీలించి, స్వీడిష్ అకాడెమి, ఈ పురస్కారాన్ని గ్రేట్ బ్రిటన్‌కు చెందిన రచయితకు ఇవ్వాలని నిర్ణయించింది. శతాబ్దాలుగా ఆంగ్ల దేశపు సాహిత్యం గొప్పగా వర్ధిల్లుతోంది. టెన్నిసన్ కవియొక్క అమరగీతాలు శాశ్వతంగా మౌనం వహించాక, ఒక సాహితీయుగం, కవిత్వపు స్వర్ణయుగం అంతమైంది. ఆ కవితా దీపాన్నెత్తుకునే కవి కనుచూపుమేరలో కనుపించలేదు. అలాగే మాదేశంలోను టెగ్నర్ వెళ్ళిపోయాక అదే పరిస్థితి నెలకొంది. అయితే కవిత్వం ఎప్పుడూ అంతం కాదు, కొత్త ఆహార్యంతో కొత్త యుగాన్ని ఆవిష్కరిస్తుంది.

టెన్నిసన్ కృతులలోని ఆదర్శవాదం అందరి కనులను ఆకట్టుకుంటుంది. అతనిలాగానే ఆదర్శవాద లక్షణాలను కలిగిన కవులు లేకపోలేదు. అయితే వారి ఆదర్శవాదం బాహ్యమైంది; పదచిత్రాలకు సంబంధించినది. వారి రచనలలోని జీవితం మనకాలపు సంఘర్షణలతో, జీవితపు అస్తిత్వ సమస్యలతో నిండి వుంది. ఈ వర్ణన ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారానికి ఎంపికైన రుడ్యార్డ్ కిప్లింగ్‌కి అన్వయిస్తుంది. కిప్లింగ్ ఈ కాలపు ఆంగ్ల సాహిత్యంలో అత్యున్నతుడని ఒక ఫ్రెంచి రచయిత అన్నాడు.

కిప్లింగ్ బొంబాయిలో, డిసెంబరు 30, 1865న జన్మించాడు. ఆరేళ్ళ వయసులో ఇంగ్లండులోని తన బంధువుల యింటికి పెంపకానికి పంపబడ్డాడు. పదిహేడేళ్ళ వయసులో మరల ఇండియాకు తిరిగి వొచ్చాడు. ''ది సివిల్ అండ్ మిలిటరీ గెజెట్'' అనే లాహోర్ నుండి ప్రచురింప బడుతున్న పత్రికలో ఉద్యోగంలో చేరాడు. ఇరవయ్యేళ్ళ వయసులో అలహాబాదు నుండి వెలువడే ''ది పయొనీర్'' కు సంపాదకుడయ్యాడు. జర్నలిస్టుగా ఇండియా అంతటా పర్యటించాడు. ఆ పర్యటనల వల్ల భారతీయుల జీవన విధానాల ఆంతర్యాలను ఆకళింపు చేసుకున్నాడు. అనేక భారతీయ సంఘాలతో దగ్గరి సంబంధాలేర్పరుచుకున్నాడు. వారి ఆచార వ్యవహారాలను, ఇండియాలో ఆంగ్లేయుల మిలిటరీ జీవన విధానాన్ని అర్థం చేసుకున్నాడు. వీటన్నిటి ప్రభావం కిప్లింగ్ రచనలమీద వుంది. తన రచనలతో ఇండియాను ఇంగ్లీషువారికి దగ్గరయేట్టు చేశాడు. 1886లో అతడు రచించిన ''డిపార్ట్‌మెంటల్ డిట్టీస్'' అందరినీ ఆకట్టుకుంది. 1888లో రచించిన ''ప్లెయిన్ టేల్స్ ఫ్రమ్ ద హిల్స్'', ''సోల్జర్స్ త్రీ'' అనే కథా సంకలనాలు చెప్పుకోదగినవి. అదే సంవత్సరంలో రచించిన ''ది స్టోరీ ఆఫ్ ది గాడ్స్ బీస్''; ''ఇన్ బ్లాక్ అండ్ వైట్''; ''అండర్ ది దియొదార్స్'' సిమ్లా సాంఘిక జీవితాన్ని వర్ణిస్తాయి. ''లైఫ్స్ హేండికాప్''; ''ది లైట్ దట్ ఫెయిల్డ్'' 1891లో రచింపబడిన సంకలనాలు.

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

1892లో రచింపబడిన ''బారక్ రూం బాలెడ్స్'' కవిగా కిప్లింగ్‌కు మంచి పేరు తెచ్చి పెట్టాయి. ప్రధానంగా ఇవి సైనికుల పాటలు. ఈ బాలెడ్స్‌లో బ్రిటిషు సైనికుల కష్టాలు, వారు పోగొట్టుకునే జీవితానుభవాలు, యుద్ధంలో వారి అనుభవాలు, సాధించిన విజయాలు వర్ణించబడ్డాయి. తన గీతాల్లో సైనికుల, నావికుల ఆలోచనల్ని వారి భాషలోనే వర్ణించాడు. 1896లో రచించిన ''ది సెవెన్ సీస్'' కిప్లింగ్‌ను ప్రపంచ సామ్రాజ్యపు వలసవాదిగా నిరూపించింది. బ్రిటీషువారిని వలసరాజ్యాలతో అనుసంధించిన రచయితగా కిప్లింగ్‌కు ఎవరూ సాటిరారు.

1894లో రచింపబడ్డ ''ది జంగిల్ బుక్స్'' స్వీడన్‌లోను, మరెన్నో దేశాలలోను ప్రసిద్ధమయ్యాయి. వీటిలోని జంతు పాత్రలు, వాటితో కూడిన దృశ్యాలు అద్భుతమైనవి. వాటి వర్ణనలు ప్రకృతి కవిత్వమయంగా వుంటాయి. ఈ కథలు కిప్లింగ్ స్పష్టతకు, ద్రష్టతకు ప్రతీకలు. కిప్లింగ్ ''జంగిల్ బుక్'' కథలు ప్రపంచంలోని అనేక దేశాల బాలలకు అతణ్ణి ఆత్మీయుణ్ణి చేశాయి. కిప్లింగ్ రచనల్లో 1901లో రచించిన ''కిమ్'' ప్రత్యేకమైంది. ఈ రచనలోని బౌద్ధ భిక్షువు పావన గంగా తీరాన చేసిన తీర్థయాత్రల వర్ణన అద్భుతమైనది.

కిప్లింగ్ శైలిలో అశ్లీలతను గురించిన విమర్శలున్నాయి. అందులో కొంత నిజమున్నప్పటికి, అతనిశైలికి ఒక ఆకర్షణ వుంది. అతడు ఆంగ్లో-ఇండియన్ ప్రపంచంలోనే గాక, ఇతర దేశాల్లోను ప్రసిద్ధుడయ్యాడు. 1899లో, అమెరికాలో అనారోగ్యంతో వున్న రోజుల్లో అమెరికన్ వార్తా పత్రికలు అతని ఆరోగ్యాన్ని గురించి రోజువారీ వివరణలను ప్రచురించాయి. జర్మన్ చక్రవర్తి కిప్లింగ్ భార్యకు టెలిగ్రాం పంపాడు.

కిప్లింగ్ గొప్ప ఆలోచనాశీలి కాకపోవచ్చు. కాని, వాస్తవ జీవిత పరిశీలనతో, వివరణతో, భావనాశక్తితో, అంతర్దృష్టితో, పాత్రచిత్రణతో తనదైన సాహిత్యాన్ని సృజించాడు. ఒక్కోసారి, అతని శైలిలో సౌకుమార్యం లోపించినట్లనిపించినా, అతని పాత్రలు హృదయాన్ని పట్టుకుంటాయి. అతని మానవ స్వభావ పరిశీలన, ఇంద్రియగ్రాహ్యమైన వర్ణనలు ఉన్నతమైనవి. అతని జీవన తత్త్వం ప్యూరిటన్ కాలానికి, పాత నిబంధనకు చెందినది.

సౌందర్యం విషయంలోను కిప్లింగ్ ఆదర్శవాది. అతిశక్తివంతమైన సామ్రాజ్యాలు కూడ తమ పునాదుల్ని ప్రజల హృదయాల మీద నిర్మించుకోకపోతే అవి అస్తమిస్తాయని అతని నమ్మకం. భగవంతుడు అన్నింటినీ సమకూర్చిన 'గ్రేట్ అబ్జర్వర్'. బ్రిటిషు సామ్రాజ్యం అతణ్ణి తమ జాతీయ కవిగా భావించింది. 1897లో విక్టోరియా రాణి డైమండ్ జూబిలీ సందర్భంగా ''రిస్సెషనల్'' రచించాడు. అందులో జాతీయాభిమానం కొట్టవచ్చినట్టు కనబడుతుంది. బోయర్ యుద్ధ సమయంలో కిప్లింగ్ తన దేశాన్నే సమర్థించాడు. బోయర్స్ యొక్క వీరోచిత సాహసానికి అతడు నివాళులర్పించాడు.

ఆంగ్ల సాహిత్యం ఎన్నో ఉద్యమాలను చూసింది; షేక్స్పియర్ లాంటి సాహితీ శిఖరాన్ని ఆవిష్కరించింది. కిప్లింగ్‌లో మనకు స్విఫ్ట్, డిఫోల లక్షణాలే కనిపిస్తాయి. అతనికి స్విన్‌బర్నే లాంటి

సుందరశైలి లేకపోయినప్పటికి గ్రీకులక్షణమైన సౌఖ్యం సౌఖ్యం కోసమే అనే విధానం లేదు. అతణ్ణి పెరిలోటి, డికెన్సులతో ఆధునికులు పోలుస్తుంటారు. అతని సృజన అపారమైనది. అరణ్యాక సూత్రాలైన ఘర్షణ, విధి, నమ్రత సర్వవ్యాప్తమైనవి. కిప్లింగ్ ధైర్యం, ఆత్మత్యాగం, నమ్రతను ప్రబోధించాడు. పిరికితనాన్ని, క్రమశిక్షణా రాహిత్యాన్ని నిరసించాడు.

కిప్లింగ్ స్వతంత్ర రచయితే అయినా బ్రెట్‌హార్ప్, డిఫో, డికెన్స్ అతణ్ణి ప్రభావితం చేశారు. బ్రెట్‌హార్ప్‌లాగ తిరుగుబోతు జీవితంలోని చిత్ర సౌందర్యాన్ని, డిఫోలాగ ఖచ్చితమైన వర్ణనని, డికెన్స్‌లాగ సామాన్యుడి జీవితం మీద కరుణను అతడు అభిమానించాడు. 1899లో అతడు రచించిన కథా సీరియల్ ''ఫ్రం సీ టు సీ'' వర్ణనాత్మకమైనది. అతనిలో గొప్ప వ్యంగ్య వైభవం వుంది. అది ఒక్కోసారి ఘాటుగానూ వుంటుంది.

కిప్లింగ్ చాలా చిన్న వయసులోనే ప్రసిద్ధుడయ్యాడు. అతనిలో మూడు ముఖ్య విషయాలను అతని జీవిత చరిత్రకారులు పేర్కొన్నారు. అతని కరుణ ''దిస్టోరీ ఆఫ్ మహ్మద్‌దిన్''; ''విదౌట్ బెనిఫిట్ ఆఫ్‌క్లెర్జీ'' లోను; వ్యంగ్యవైభవం ''డిపార్ట్‌మెంటల్ డిట్టీస్''; ''ప్లెయిన్ టేల్స్ ఫ్రమ్ ద హిల్స్''; ''ది స్టోరీ ఆఫ్ ద గాడ్స్ బీస్''; ''ద లైట్ దట్ ఫెయిల్డ్ లోను; అతని నీతి ''లైఫ్స్ హాండీకాప్‌లోను దర్శనమిస్తాయి. కిప్లింగ్ దేశభక్తుడు. అతని రచనలన్నింటిలోను అది కనుపిస్తుంది.

ఆంగ్ల సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన అత్యుత్తమ రచయిత, ద్రష్ట- రుడ్యార్డ్ కిప్లింగ్‌కు ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేయాలని స్వీడిష్ అకాడెమి నిర్ణయించింది.

**జీవిత చరిత్ర**

రుడ్యార్డ్ కిప్లింగ్ (1865-1936) బొంబాయిలో జన్మించాడు. ఇంగ్లండులోను, యునైటెడ్ సర్వీస్ కాలేజి, వెస్ట్‌వార్డ్‌హో, బెడ్‌ఫర్డులోను విద్యనభ్యసించాడు. 1892లో ఇండియాకు తిరిగి వచ్చి ఆంగ్లో- ఇండియన్ వార్తా పత్రికల్లో పనిచేశాడు. 1886లో ''డిపార్ట్‌మెంటల్ డిట్టీస్''తో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు. రచయితగా ప్రసిద్ధుడయ్యాడు. కవిగా బ్రిటీషు సామ్రాజ్యపు సామాన్య సైనికుణ్ణి వర్ణించాడు. ''ప్లెయిన్ టేల్స్ ఫ్రమ్ ద హిల్'' 1888, ''సోల్జర్స్ త్రీ'' 1888, కొన్ని కథా సంకలనాలు రచించాడు. సామాన్య సైనికుడి జీవితాన్ని వర్ణిస్తూ 1892లో ''బారక్ రూమ్ బాలెడ్స్'' రచించాడు. 1894లో రచించిన ''జంగిల్ బుక్'' ప్రపంచదేశాల బాలల పురాణంగా ప్రసిద్ధి చెందింది. 1901లో ''కిమ్'' వ్రాశాడు. ఇది ఒక బౌద్ధ భిక్షువు యొక్క హిమాలయ పర్యటనల వర్ణన. ''ది సెకెండ్ జంగిల్ బుక్'' 1895; ''ది సెవెన్ సీస్'' 1896, ''కెప్టెన్స్ కరేజియస్'' 1897, ''ది డేస్ వర్క్'' 1898, ''స్టాకీ అండ్ కో'' 1899, ''పక్ ఆఫ్ పుక్ హిల్స్'' 1906, ''యాక్షన్స్ అండ్ రియాక్షన్స్'' 1909, ''డెబిట్స్ అండ్ క్రెడిట్స్'' 1926, ''దైసర్వెంట్ ఎ డాగ్'' 1930, ''లిమిట్స్ అండ్ రెన్యువల్స్'' 1932, అతని ఇతర రచనలు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో కొన్ని ప్రచార పుస్తకాలు వ్రాశాడు. అతని కవితల సంకలనం 1933లో ప్రచురింపబడింది.

కిప్లింగ్ ఎన్నో పురస్కారాలందుకున్నాడు. 1926 ''గోల్డ్ మెడల్ ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్'' అందుకున్నాడు. స్కాట్, మెరిడిత్, హార్డీల తరువాత ఆ పురస్కారాన్నందుకున్న రచయిత కిప్లింగ్ మాత్రమే.

# అధివాస్తవికత - విసుర్తున్న సరికొత్త సవాలు

- గూడ శ్రీరాములు

'కాలం విడిచెళ్లిన కరపత్రాలుంటాయి. అవమానాలకీ, ధూషణలకీ గురైనగత ఆటగాళ్లుంటారు. సత్యానికింకా తగు చోటు ఉందనుకున్నప్పుడు వాటి గుణావగుణాల నిర్ధారణ స్వేచ్ఛ ఈ తరానికి కల్పించటం నేటి మరువరాని అవసరం' అంటాడొకాయన[1].

కొందరు కవులు, కళాకారులు జీవిత కాలంలోనే మరణిస్తారు. మరి కొందరు చచ్చి బతుకుతారు. అలానే సాహిత్య కళా ఉద్యమాలు. మసిపూయబడ్డ, మరుగు పరచబడ్డ, శపించబడ్డ కొన్ని కొన్ని సాహిత్యకళా ఉద్యమాలు తరాంతరాల్లో మళ్లీ పనికొచ్చేవిగా ప్రమాణితాలయి ప్రాణాలు పోసుకుని రావొచ్చు.

కళ్లెదుట ఉన్నన్ని దౌష్ట్యాలు, పీడనలు, ఘోరాలు విచ్చలవిడులు చేస్తుంటే సాహిత్యంలో ఇంకా కల్లబొల్లి కబుర్లు, దోబూచాటలు సాగేవేనా అన్న ప్రశ్న పాతకాలాల్లోనే ఎదురయింది. 2వ ప్రపంచ యుద్ధ బీభత్సాన్ని చూసాక పోలెండు రచయితలు (స్కామండ్రేటులు) ఇంకా లిరికల్ రచనలకి అర్థంలేదన్నారు. 'నేటి దుఃఖ జగత్తులో ఉంటూకూడా 'శాశ్వత కావ్య' రచన ఒక విలాసం మాత్రమే' అంటాడు నజ్రుల్ ఇస్లాం[2]. 'చరిత్రని మరిచిన చతుర కళ బాధని తనలో ఇమిడ్చుకోలేదు' అంటాడు ఎడోర్నో[3].

కోపంతో పెదాలు కరుచుకుంటున్నవాడు కవిత్వం రాయకుండా ఇంకేం చేయగలడు? జుత్తుపీక్కుంటాడు. విచ్చలవిడి పిచ్చివాడవుతాడు. విదూషకుడవుతాడు, అరాచకవాది- విధ్వంసకుడు- నియమభంజకుడు అవుతాడు. కోపాన్నీ, కసినీ, తిరుగుబాటునీ తెలపరాదన్న రీతుల్లో తెలపకుండా ఉండలేడు. సాహిత్యంలో ఇంకా సౌందర్యం పాటించలేడు. అబద్ధాలు అనుసరించలేడు. చూసింది చూపెట్టకపోతే రాసింది అబద్ధం అయిపోతుందని భావిస్తాడు. విగ్రవీగే వివస్త్రాన్ని వివస్త్రంగానే ఎదుర్కోబోతాడు.

1వ ప్రపంచయుద్ధ రౌద్ర్య క్రౌర్యానికి నీతి, నియమం, న్యాయం పచ్చిగా ఓడిపోయాయి. ఆ హాహాకారాలు, అంతరంగ కోలాహలాలకి అప్పటికే జరిగివున్న అక్టోబర్ విప్లవం భాష్యం చెప్ప లేకపోయింది. ఫ్రాయిడ్‌లో అది దొరగ్గలదేమోనన్న ఆశ పెంచుకోబడింది. ఒక్క మార్క్సేకాక, ఒక్క ఫ్రాయిడేకాక ఆ ఇద్దర్నీ కలిపేయగలిగితే ఓ sur (= above) realism ఓ అధి ( అతి, పరా) వాస్తవికత నెలకొనగలదని తలనబడింది. ఆ విప్వాల ప్రపంచం ఎలుగెత్తి విసుర్తున్న ప్రశ్నలకి సమాధానం దొరకగలదేమోనని ఆశించబడింది. అలా సర్రియలిజం రంగప్రవేశం చేసింది. సామాజిక రంగంలో విప్లవానికి తొలినాటి హెగెల్‌ని కాదని లెనిన్‌ని పరామర్శించింది. మానసిక క్షితిజంలో విప్లవానికి మొదట ఫ్రాయిడ్‌ని కాదని రాంబోనీ చూసింది. ''ఏ విధంగానైనా విప్లవసాధన' కార్యాచరణ చేపట్టింది. 'మానసిక మనిషి'లో 'విప్లవమనిషి'నీ, విప్లవ మనిషిలో మానసిక మనిషిని చూడగోరింది. ఇటు జీవితంలో స్వేచ్ఛ, అటు సమానత్వ సాధనలో నిష్ఠ కోరింది.

---

గూడ శ్రీరాములు, భిలాయి

మాస్కో విచారణల్లో కత్తివేటుకి బదులు కనికరం కావాలంది. ట్రాట్స్కీని అనుసరించింది. అప్పటి కమ్యూనిస్టు మేధావుల ఆగ్రహానికి గురైంది. సర్రియలిజంలోని మొదటిదశ 'మస్తిష్క స్వయం చాలన' (Psychic Automation) ని మాత్రమే చూపి ఆ మేధావులు దాన్నో 'వెర్రియజం'గా ముద్రవేసారు. బహిష్కరించారు. సామాజిక సమన్యాయ పోరాటాన్ని సమర్థించింది. దళారి వ్యాపారాలూ, యుద్ధాలూ ఆపాలంది. సర్రియలిజంలోని రెండవదశ 'సామాజిక విప్లవం, యుద్ధ వ్యతిరేకత' మీద కనుకప్పబడింది. అదో 'విర్రవీగుడు విదూషకత్వం'గా పాశ్చాత్య విద్వత్ విమర్శ చిత్రించింది.

అలా ఇరు మేరు గురు శక్తుల కన్నెర్రలకి ఒక సాహిత్య కళా ఉద్యమం గురై బలికావటం కళా సాహిత్య రంగ చరిత్రలో నభూతమయింది. 1941 లోనే సర్రియలిజం చచ్చిపోయిందని ప్రకటించి దాన్నో శుష్క శిథిల అశుభ్ర వికట కళా శకలంగా సాహిత్య చరిత్రకెక్కించటం జరిగింది. 1925లో సర్రియలిస్టు పత్రిక 'La Revolution Surrealisme' మూడవ సంచికని ఆర్తోద్, దెనోల సంపాదకత్వంలో 'ఓ కొత్త మార్మికత' లోకి మళ్లించబడ్డప్పుడు ఆ పత్రిక సంపాదకత్వం స్వయానా బ్రెతాఁ చేపట్టవలసిన కారణాన్ని పాశ్చాత్య, మార్క్సిస్టు మేధ గుర్తించ నిరాకరించింది.

1924 నాటి మొదటి మానిఫెస్టోని మాత్రమే ఎత్తిచూపి, 1930 రెండో మానిఫెస్టోని తడవ నిరాకరించింది. 1946లో ఆ రెండో మానిఫెస్టోకి బ్రెతాఁ రాసిన ముందుమాట అట్టి పెట్టింది. సోవియట్ విద్యా కమీసర్ (మంత్రి) లూనాచార్స్కీ ఫ్రాన్స్ పర్యటనకొచ్చినప్పుడు బ్రెతాఁ మొదలయిన సర్రియలిస్టులు సమర్పించిన ప్రకటన పత్రాన్ని కనుమరుగు పరిచింది.

1938లో మెక్సికోలో ప్రవాస జీవితం గడుపుతున్న ట్రాట్స్కీతో కలిసి బ్రెతాఁ రాసిన 'Manifesto for an Independent Revolutionary Art' కనుమరుగు కాబడింది.

సోవియట్ వ్యవస్థ కూలిపోయాక అది విడిచెళ్లిన శూన్యంలోకి పోస్ట్-మోడర్నిజం రాదలిచింది. (సోవియట్‌లో సామ్యవాదం ఎప్పుడూ నెలకొనలేదనీ, కనుక అది ఎప్పటికయినా కుప్పకూలక తప్పదనీ 1930ల్లోనే వామమేధావులే పలికిన జోస్యాలు లేకపోలేదు) నిరపేక్ష అభివ్యక్తివాద (Abstract Expressionism) పరిణామ క్రమ రూపాలుగా పాప్‌కళ, తర్వాత ఫోటోరియలిజం వచ్చాయి. వాణిజ్యం, ప్రచారమాధ్యమాలు, విపణుల్ని పాప్‌కళ ఘనత కెక్కించింది. ఆధునికోత్తర అలజడి పరుగుల జీవితాన్ని ఫోటోరియలిజం కీర్తించి గణుతికెక్కించింది. అయితే తప్పి పోయిన రియలిజం మళ్లీ తిరిగొచ్చింది. ఆ తర్వాత ఉత్తర నిర్మాణవాదం (Post-Structuralism)లోంచి పుట్టిన వినిర్మాణం 'Deconstruction' సాహిత్య సమూల సమాలోచనగా వచ్చింది,. (చివరిదాకా తాను వామపక్షీయుడనని సగర్వంగా చెప్పుకున్నాడు దెరిదా).

ప్రొలటేరియట్‌నించి డిక్టేటర్‌షిప్ తొలిగిపోగా తప్పిపోయిన 'మనిషి'ని ఒక గ్రాంసీ (గ్రాంశ్చీ), ఒక రోజా లక్సెంబర్గ్, మరో ట్రాట్స్కీలగుండా మళ్లీ తేదలిచారు కొందరు విక్షుబ్ద యువ వామ మేధావులు. మారిన రోజుల్లో వందేళ్ల మార్క్సిజంలో కొన్ని మార్పులు, చేర్పులు అవసరమన్నారు. కొత్త భాష్యాలు పలుకుతూవచ్చారు. పోస్టు-మోడర్న్ అంటూ కాలవిభజన జరిగింది. ఉత్తర-నిర్మాణవాదులు, Hermeneuticitst లు కావలసిన వీళ్లు మార్క్సిస్టు తీవ్ర విమర్శలకి గురి కావటంతో మార్క్సిస్టు వ్యతిరేకులుగా మారిపోయారు. పోస్టుమోడర్నిజంలో ఇమిడిపోయారు (మన బాలగోపాల్‌లాంటి వాళ్లు నయం). ఆదిలో పోస్టుమోడర్న్ రచయితలు సాహిత్యాన్ని సామాజిక

పరిశోధనకి వినియోగించారు. సత్య నిరూపణలకి సూక్ష్మ పరీక్షణలు జరగాలన్నారు. ఆత్మాశ్రయంతో జరగాలన్నారు. ఆత్మాశ్రయంలో మానవాదరణ చూపారు. అవచేతన కోరికల మన్నింపు కోరారు. ఆత్మిక ఆత్మాశ్రయత సామాజిక వస్త్వాశ్రయతల్ని కలపజూసారు. ఆధిపత్య రాహిత్యాన్ని కోరారు. తెగ / గణ జాతుల ఆశయాల గుర్తింపు కోరారు. అయితే రానురాను మరో చూపుల కొత్తవాళ్ల చేర్పుళ్లతో అది పూర్తిగా మార్క్సిజాన్ని వ్యతిరేకించే నవతరం వేదిగ్గా మారింది. తొలి రూపు పోగొట్టుకుంది. వినియోగదారీ సంస్కృతితో రాజీపడింది. దాని కొమ్ము కాయ కాగోరింది. సాహిత్య కళారంగాలు ఎప్పుడూ ఎంతోకొంత తిరుగుబాటు తత్వం కలిగి ఉంటాయి. కనక రాజీల పో-మో రాణించలేకపోయింది.

గత 50 ఏళ్లుగా నిశ్శబ్ద ఏకాంతంలో పరిశోధన సాగించుకుంటూ వొస్తున్న సర్రియలిస్టులు తొలినాటి 'చారిత్రక నిరపేక్ష' (Historical Abstraction) సర్రియలిజంని 'చారిత్రక సర్రియలిజం' (Historical Surrealism)గా మార్చుకుంటూ, పూర్వీకులకి భిన్నులయ్యారు. కళలో అర్థవంతమయిన వ్యక్తీకరణల్తో అధివాస్తవికత పునరుత్థాన దిశలో ముందుకొస్తున్నారు.

పుట్టిన దేశం ఫ్రాన్స్‌లోనూ, సమస్త బౌద్ధికాలకీ ప్రసూతిగృహమయిన అమెరికాలోనూ సమకాలీన మేధావర్గాల్లో 'పురాతన చరిత్ర'గా మారిపోయాడు ఆంద్రీ బ్రెతాఁ, అవాఁ-గార్డ్ (avant-grade =vaneguard = అగ్రగామి) అల్లరి మూకల నిరంకుశ నాయకుడిగా అకడెమిక్ విమర్శచేత ముద్రించబడ్డాడు. పోస్టు-మోడర్న్ అలసట సినిక్ మేధావులచేత అసూయతో గర్హించబడ్డాడు. అలాంటి బ్రెతాఁని 'మళ్లీ బతికించుకోటం' తక్షణ కర్తవ్యంగా ఎంచబడింది. బ్రెతాఁ ఫ్రెంచి రచనల అనువాదాలు జోరుగా సాగుతున్నాయి. బ్రెతాఁ శతజయంతి ఉత్సవాలు (1996) జరుపబడ్తున్నాయి. మరువబడ్డ సర్రియలిజంపై సరికొత్త మూల్యాంకనలు జరుగుతున్నాయి. విశ్లేషణ గ్రంథాలు వెలువడుతున్నాయి. చుట్టూ అల్లుకుని పోయిన పాత అపోహలు పగుళ్లుదేరుతున్నాయి.

'అంతరంగ నిర్మాణ ఎరుక అవసరం ఎంత అవసరమో తెలియజెప్ప దలిచిన కళా విధానాన్ని గుర్తించటానికి రెండవ ప్రపంచ యుద్ధానంతర తరాల కళాకారుడికి 50 ఏళ్లు పట్టాయి. అలా అర్థం చేసుకున్నవాడు మాత్రమే అవచేతనలో కదిలే బింబాల్ని ఓపికతో విశ్లేషించి మానసిక, భౌతికస్థాయిలో వాటిమధ్య నున్న అంతర్గత సంబంధాలు వెతికి వివరించగలడు'.

ప్రపంచ సాహిత్యరంగాన చోటు చేసుకుంటున్నట్టుగానే 'దందహ్యామాన దశకా' నంతర తెలుగు కవితారంగాన సర్రియలిస్టు రెండవదశ తెలిసోతెలియకనో, యాదృచ్ఛికంగానో నిశ్శబ్దంగానో చోటుచేసుకుంటూ పోయింది. సామాజిక - విప్లవ -సాంస్కృతిక చైతన్యం గాయాల నెమరింతలు పడ్తుండగా సంకెళ్లులేని, సరిహద్దులు లేని అస్తిత్వ నిరూపణల అలుగుడు కవిత్వం రాదలిచింది. స్త్రీ వాద కవిత్వం రాసింది. దళిత కవిత్వం రాసింది. మైనారిటీ కవిత్వం రాసింది. వీటివేటితోనూ పొత్తుకుదరని అశాంత అవాఁ-గార్డ్ రెబెల్ కవిత్వం రాసింది. నవ - సామ్రాజ్య వ్యతిరేక కవిత్వం రాస్తున్నది.

కుర్డు (టర్కీ- ఇరాక్), బదోయిన్ (అరేబియన్ దేశాలు), జిప్సీ (ఐరోపా). ఆస్ట్రేలియా / అమెరికా ఉపజాతులు, ఎస్కిమోలు మొ. తెగ / జాతుల తత్వం (Ethnicity) లోని 'తెగ, జాతి'కి వర్గసమాజంలోని 'కులం, జాతి'గా అర్థం చెప్పుకోబడింది. "After Marxism Feminism" గా ఆశలు పెంచుతూ వొచ్చి చివరికి శారీరకతత్వ వివరణలకీ, పాశ్చాత్య దేశాల్లో కూడా అరుదయిన

'single parent' వ్యవస్థ కుతూహలాలకి శక్తిదురుపయోగం జరిగింది. Holistic దృక్పథాన్ని కాదని సమాజ శకలీకరణ, మార్క్సిస్టు వ్యతిరేకతల పోస్టుమోడర్నిజంలో దళిత, స్త్రీ, మైనారిటీ వాదాలు తమని తాము వెతుక్కుని అందులో భాగాలుగా గుర్తింపు కోరాయి. ఉనికి తెలుపుకోగలిగినా, కొన్ని రాయితీలు పొందగలిగినా అనతి కాలంలోనే తొలి ఆశ్చర్యజనకతలు పోగొట్టుకుని విస్మృతాభిముఖాలవుతున్నాయి. సమస్యల అసలు కారణాల్నించి వైదొలిగిన సామాజిక ఉద్యమాలు స్వల్పకాలికాలవుతాయన్న సాక్ష్యాలు వదిలిపోదలుస్తున్నాయి. అయితే ఈ వాదాల్లో కూడా విభిన్న స్వరాలు వినిపించకపోలేదు. లంబ (vertical) సమానత్వవాదులు పోస్టుమోడర్నిజంతో సంతృప్తి పడగా, క్షితిజ (horizontal) సమానత్వవాదులు దాంట్లో ఇమడలేక ముందు అన్వేషణలు సాగించారు.

చీలుదారులవద్ద దిక్కుకానక నిలబడ్డ అవాం-గార్డ్ రెబెల్ కవిత్వం ఆదిలో పోస్ట్ మోడర్నిజంవైపు మొగ్గుపడినా ఆ భ్రమావరణనించి త్వరలోనే బయటపడసాగింది.

నేటి సరికొత్త సామ్రాజ్యవ్యతిరేక కవులు పో-మో అవశేషాలు లేని కవిత్వం రాయదలుస్తున్నారు. (పో-మో సామ్రాజ్యవాద వ్యతిరేకి కాదు).

ఈ మూడు విడి వర్గాల కవులు, రచయితలు, కళాకారుల్లో ప్రతిభగలవాళ్లున్నారు. నిగ్గులున్నారు. దృక్పథ స్పష్టత కలవాళ్లున్నారు. వీళ్లందరిమధ్యా కనిపించక పారే ఉమ్మడి ధార ఏదయినా ఉందా? ఉంటే అదేంటి? ఆధునిక చారిత్రక అధివాస్తవికత/ Verist Surrealism గుర్తుకి రాగలదా? ఔను, ఏమో అనిపించకపోదు. మనసులేని మార్క్సిస్టుల్ని వ్యతిరేకించిందేగాని శాస్త్రీయ మార్క్సిజంతో చారిత్రక అధివాస్తవికతకి ఎలాంటి వైరుధ్యమూలేదు. అది పూరకం, సంపూరకం.

గెద్దాల దెయ్యం ఎన్ని సంశయాలకీ, నవ్వుతాలకీ గురైనా ఎక్కువ-తక్కువలున్నంతదాకా వెంటాడుతూనే ఉంటుంది. వియంతలన బడ్డవాళ్లు నశించిపోయుండొచ్చు. వాళ్ల దిక్కులేని సంతానాలు ఓడిపోయివుండొచ్చు. ప్రపంచం గొడ్డుపోలేదు. మార్క్స్, లెనిన్‌లు ఒకళ్ళ సొత్తేంకారు.

అధికార/ ఆధిపత్య కాంక్ష వ్యవస్థితమవటంతో చీకటి యుగాలు మధ్యయుగాల్లోకి అడుగులేసాయి. రాజ్యాల మధ్య, జాతులమధ్య యుద్ధాలు జరిగాయి. రాజ్యాలు గెలువబడ్డాయి. సామ్రాజ్యాలు వెలిసాయి. సంస్కృతులు వ్యాపించాయి. వ్యాపారాలు సాగాయి. వ్యాపారాభివృద్ధుల్తో వలసాధిపత్యాలు నెలకున్నాయి. ఆధిపత్యాలు వాటిలో అవి పోటీలు పడ్డాయి. ప్రపంచ యుద్ధాలు జరిగాయి. బలమయిన జీవులే బతక్కగలవనే సూత్రీకరణలు జరిగాయి. అధిమానవ కల్పన జరిగింది. ఆధిపత్య కాంక్ష అలా పెరుగుతునే పోయింది.

అధికారకాంక్ష ప్రతిమనిషిలో వీడని స్వభావం. అది కిందునించి పైదాకా పేరుకుపోయి ఉంటుంది. ప్రాథమిక అవసరాలు తీరాక, ఆధునిక సమస్త భౌతిక సదుపాయాలూ దక్కించుకున్నాక. చివరికి ఆధిపత్యం మనిషి కాంక్షని పెంచుతుంది. సామాన్యులు కూడా ఆధిపత్య శిఖరాలకి చేరుకున్న ఉదాహరణలున్నాయి. పూర్వజన్మ సుకృతాలు ఇంకా నమ్మించబడలేక పోయాయి. ప్రథమ దశల్లో కొందరిదాకే సీమితమయిన అధికార కాంక్ష సామాన్యులదాకా చేరగలగటం అత్యాధునిక సమాజవ్యవస్థలో చూడవచ్చే గొప్ప మార్పు కాగలిగింది.

అన్ని స్థాయిల్లోని ఆధిపత్యానికి మొదటి అవసరం సంపద. కనక ప్రతి మనిషీ దాని వెంట ఎలుక పందాలకి (rat race) దిగుతాడు. జీవితాల్లో పరుగు పందాలు పెరుగుతాయి. డబ్బు సంపాదనే ముఖ్య

ధ్యేయం అయినప్పుడు సకల మార్గాలూ అనుసరణీయాలవుతాయి. నైతిక విలువలు వాట్ని ఆపలేవు. జాలి, దయ, చివరికి పేగు సంబంధాలూ అడ్డుకోలేవు. నాగరికత పెరిగే కొద్దీ ప్రపంచం క్రమంగా సత్యం, ధర్మం, న్యాయ కేంద్రకాల్నించి తప్పుకుని ఆర్థిక కేంద్రోన్ముఖమయ్యింది.

అయితే మార్పన్నది సహజ గుణం. ఆధిపత్యాలు పెరిగి పెరిగి అంతర్గత అస్తిత్వ సంఘర్షణలకి చేరుకుంటాయి. శిఖరాధిపత్యాలు ఎంతగా పెరిగితే నిమ్నాధిపత్యాలు అవసరమొచ్చినప్పుడు అంతగా ఏకమయి ఎదుర్కొంటాయి. అలా మీదు కిందు ఆధిపత్య స్థాయిలు ఒక దాంతో ఇంకోటి ఘర్షణ పడ్తూపడ్తూ నిమ్న, నిమ్న సమస్థాయిలకి చేరుకోగల్గుతాయి. అందరూ ఆధిపత్య సమానులయిన సమాజం సమసమాజానికి చేరువయ్యే వీలుంది. కనక ఆ మార్గంలో నేటి పరుగులు స్వాభావిక స్వయం జాతాలనిపిస్తాయి. పరుగెత్తలేనివాడు పడిపోక తప్పని సమాజం నేటిదయింది. బలహీనుణ్ణి నిలబెట్టగలిగే ఆశల సక్రమ నిర్వహణ జరగలేక పోవటం చరిత్ర సాక్ష్యమయ్యింది.

20వ శతాబ్ది వెళ్తూ వెళ్తూ ఈ శతాబ్దికి ఈ కానుకిచ్చి మరీవెళ్లింది. రాజకీయం గత శతాబ్దిని ఊచకోతలు కోసిందేతప్ప ఊరట కల్పించలేక పోయింది. మరింత వేడెక్కించగలిగిందే తప్ప శాంతింప జేయ లేక పోయింది. ఈ లక్ష్య సాధనలో రాజకీయాల అసమర్థత. వైఫల్యాలు నిరూపించబడ్డాయి. రాజ్యాలూ, సామ్రాజ్యాలూ నశించిపోయాయి. చక్రవర్తులూ, సమ్రాట్టులూ వెళ్లిపోయారు. నశించనిదల్లా, పోనిదల్లా ఒక్క అప్పటి సాహిత్యం, కళలు శిల్పం. 21వ శతాబ్ది ప్రబల శక్తిగా సాహిత్య కళారంగం ముందుకొచ్చి ఉడికిపోతున్న ప్రపంచానికి ఊరట కల్పించగలదన్న ఆశక్తి చోటుకల్గుతుంది. ఎందుకుంటే 'దుస్సహ దుఃఖాన్ని కళ మాత్రమే చూడగల్గుతుంది. చూపెట్టగల్గుతుంది. జ్ఞాపకం చేస్తుంది. చేయిస్తుంది ( థియోడోర్ ఎడోర్న్ ).

ఒకదేశాన ఒక కవి పుడ్తే అక్కడ మరో సమాంతర ప్రభుత్వం నెలకుంటుందంటారు. పోయనోళ్లు పోగా తాజాగా అమెరికాలో ఒక నౌఅం చోమ్స్కీ, జర్మనీలో మరో గుంటర్ గ్రాస్, నైజీరియాలో ఇంకో వొలెసోయింకా, చినువా అచెబే, మరో ప్రవాస బెన్ ఒక్రీలు నిరవధిక నిశ్శబ్ద శాసనసభ్యులేకారు. ఈ దేశాలూ, ఈ ప్రపంచం నిజంగా ఏవి కోరుకుంటున్నాయో వచ్చిపోయే స్వల్పకాలిక శాసనసభ్యులకి చెప్పగలిగేవారు. అప్రకటిత అధివాస్తవికులు.

ఆర్థిక - సామాజిక - రాజకీయాల్లో చెరగని ముద్ర మార్క్సుది. సాహిత్య కళారంగాల్లో వీడని నీడ ( బెతాఁది కాబోతున్నదా!

**జ్ఞాపికలు**

1. Michael S. Bell, అమెరికా సాహిత్య నిపుణుడు. శాన్ ఫ్రాన్సిస్కో ఆధునిక కళా మ్యూజియం మాజీ సహాయక క్యూరేటర్. పుస్తకాల అరల్లో అస్పృశ్యంగా పడి మూల్గుతున్న సర్రియలిజం మీద పరిశోధన, అధ్యయనం చేసినవాడు.

2. బెంగాల్ శపిత విప్లవకవి, గాయకుడు, చెడిబతికి, బతికిచెడ్డ బొహిమియన్. శ్రీశ్రీ ఒక కవితకి అనుసరణీయుడు.

3. Theodorc Adorno, జర్మన్ తత్వశాస్త్ర అధ్యాపకుడు, తత్వవేత్త. Frakfurt School సంస్థాపక సభ్యుల్లో ఒకడు. సమాజ విశ్లేషణని మార్క్సిస్టు నిర్వచనాలకి అనువదించ దలిచాడు.

# వంటిల్లు ఒక ప్రయోగశాల - వంట చేయడం ఒక కళ

- డా॥ చాగంటి కృష్ణకుమారి

వంట ఇంటిలో చాలారకాల పాత్రలను అనేక అవసరాలకి వాడుతూ ఉంటాము. ఈ పాత్రలు రకరకాల సైజులలో, ఆకారాలలో, రకరకాల రసాయనపదార్థాలతో తయారైవంట ఇంటిని చేరుతాయి. అల్యూమినియం (రాతివెండి) పాత్రలనీ, ఇత్తడి గిన్నెలనీ, మట్టితో తయారైన కుండలు, దాకలనీ ఇదివరకు వాడేవారు. బీద సంసారాలలో ఇప్పటికీ అల్యూమినియంతో, మట్టితో, తయారైనపాత్రలు కనిపిస్తాయి. గాజు, పింగాణి, ఇత్తడి, రాగి, కంచు పాత్రలేకాక, ఆధునికంగా, ప్లాస్టిక్ బిందెలు, గ్లాసులు, నాన్‌స్టిక్ పెనాలు వంటివాటిని మీరు వంట గదుల్లో చూస్తారు. ముఖ్యంగా ఈ రోజులలో అందరిళ్లల్లో కనిపించేవి స్టెన్ లెస్ స్టీల్ పాత్రలు. రక రకాల పాత్రలలో వంట చేయడానికి ఉపయోగించే పాత్రని 'వంటపాత్ర' అనొచ్చు. ఒక్కో రకం వంటకం తయారు చేయడానికి ఒక్కో రకం వంట పాత్రని వాడుతారు.

రసాయన ప్రయోగశాలలో ఉపయోగించేపాత్రలు సాధారణంగా గాజుతోనూ, లేదా పింగాణీతోనూ తయారవుతాయి. రాగితో తయారైన జలతాపకాలనీ, స్టెన్‌లెస్ స్టీల్‌తో తయారైన విద్యుత్ జలతాప కాలని కూడా మీరు ప్రయోగశాలలో చూస్తారు. రసాయన చర్యలు నిర్వహించడానికి ఉపయోగించే పాత్రలు 'చర్యాపాత్రలు' (Reaction vessels) వంటశాలలోని 'వంటపాత్ర' లోనూ, రసాయన ప్రయోగశాలలోని 'చర్యాపాత్ర' లోనూ జరిగేవి రసాయన చర్యలే. ఆ మాటకి వస్తే, వంట కూడా ఒకవైజ్ఞానికాంశమే. అందుకే దాన్ని 'పాకశాస్త్రం' అన్నారు. పాకశాస్త్రంలో భౌతిక, రసాయనశాస్త్ర పరమైన ఎన్నో అంశాలు రాజ్యమేలుతూ ఉంటాయి. ఒక రసాయశాస్త్ర పరిశోధకుడికి తను చేస్తున్న ప్రయోగాల గురించిన విషయావగాహన, ప్రయోగాలను నిర్వహించడంలో ఊహాశక్తి, నేర్పు, ఓర్పు ఎంత అవసరమో, బలవర్థకమైన రుచికరమైన, సువాసనభరితమైన వంటకాన్ని తయారు చేయడానికి వంట వాడికి/ వంటలక్కకి / నీకూ / నాకూ..... కూడా ఊహాశక్తి, అవగాహన, ఓర్పు, నేర్పులు అంతే అవసరమవుతాయి.

వండుతున్నప్పుడు 'వంటపాత్ర' లో తీసికొనిన పదార్థాలలో భౌతిక, రసాయన మార్పులు జరుగుతూ ఉంటాయి. తయారైన వంటకం నాణ్యత, రంగు, రుచి, వాసన - ఇవన్నీ వంట పాత్రలో తీసికొనిన పదార్థల స్వభావం, వాటినిష్పత్తి, ఉష్ణోగ్రత, తేమ, పదార్థాలను ఒక్కొక్కటిగా కలిపిన క్రమం, వండటానికి పట్టినకాలం, వండుతున్న సమయంలో పాత్రలోని పదార్థాలను కలియగలుపుతున్నారా? లేదా? వంటి వాటిపై ఆధారపడతాయి. రసాయన ప్రయోగశాలలో చర్య పాత్రలో చర్యలు జరుగగా చివరికి లభించేవి ఉత్పన్నాలు (products) . ఈ ఉత్పన్నాలు ఎటువంటివి అనే విషయం, చర్య పాత్రలో తీసికొనినపదార్థాల స్వభావం, వాటి నిష్పత్తి, ఉష్ణోగ్రత, పీడనం మొదలైన అంశాల మీదనే ఆధారపడుతుంది. ప్రయోగశాలలో చర్య ఫలితాలుగా లభించిన ఉత్పన్నాలు మనం తినేవికావు. కానీ వంట ఇంటి పాత్రలోని చర్య ఫలితాలను మనం లొట్టలేసుకుంటూ తినవచ్చు.

వంట ఇంటిలో మొట్టమొదటిదీ, అతి ముఖ్యమైనదీ అయిన రసాయన పదార్థం - పాలు.

పాలలో మన జీవితం ప్రారంభం అవుతుంది. అమ్మ పాలతో మనం దిన దిన ప్రవర్థమానమై ఈ రోజున ఇంతటి వారమయ్యాము. పసితనం అంతా పాలమీదే బతుకుతాం. పెద్దయ్యాక కూడా రోజుకి ఒకటి, రెండు గ్లాసుల పాలు తాగితే ఆరోగ్యంగా ఉంటాము. పాలు సంపూర్ణ ఆహారం. పాలు,

పాలతోనూ, పాలనుండీ తయారైన పదార్థాలు శరీరానికి అవసరమయిన ఆహార పదార్థాలలో అతిముఖ్యమైనవి. ప్రధానమైనవి.

కార్బోహైడ్రేట్‌లైన సూక్రోజ్, గ్లూకోజ్, ల్యాక్టేజ్‌మొదలైనవి పంచదారలలో కొన్ని రకాలు. మనం టీలో కలుపుకొనే పంచదార కేన్ షుగర్. దీని రసాయన నామం సుక్రోజ్. పాలలో ఉండే పంచదార లాక్టోజ్. (Lactose) మన శరీరంలో లాక్టోజ్ అరిగి జీర్ణం కావడానికి ల్యాక్టేజ్ (Lactase) అనే ఎన్‌జైమ్ సహకరిస్తుంది. కొంతమంది దురదృష్టవంతులు ఉంటారు. వాళ్లకి పాలు పడవు. అదొక రకం ఎలర్జీ. అటువంటి వారి శరీరంలో ల్యాక్టేజ్ ఎన్‌జైమ్ ఉత్పత్తి కాక పోవడం వల్ల వారికి పాలు అరగవు.

పాలు ఒక తెల్లని ద్రవంగా సజాతీయంగా (homegeneous) కనిపిస్తుంది, కానీ అది కంటికి కనిపించినంత సరళమైన ద్రవం కాదు. అధిక ఆవర్ధన సామర్థ్యంగల సూక్ష్మదర్శిని (a microscope with high magnifying power)లో పాలను పరిశీలించి చూస్తే ఈ సంగతి తెలుస్తుంది. చిన్ని చిన్ని ప్రోటీన్ బంతులు (balls of protein), కొవ్వు ఉండలు (fat globules) నీటిలో తేలియాడుతూ కనిపిస్తాయి. ఈ ప్రోటీన్‌ని కేసిన్ (Casein) అంటారు. అణుబలాలవల్ల, (molecular forces) నీటి అణువులతో తాకిడి చెందటం వల్ల - ఈ ప్రోటీన్ బంతులూ, కొవ్వు ఉండలూ నీటి మొత్తంలో సమానంగా వ్యాప్తి చెంది (సమవితరణం = uniform distribution) తేలియాడుతూ ఉంటాయి.

వంట ఇంటిలో సరదాకి ఈ ప్రయోగాన్ని చేసి చూడు.

ప్రయోగం 1 :

పరికరాలు : వెడల్పుగానూ, లోతు తక్కువగానూ ఉండే పాత్ర.

పదార్థాలు : 1. నీళ్లు కలపని పాలు. 2. ఆహార రంజనాలు (food colours) 3. అంట్లు తోముకోవడానికి ఉపయోగించే ద్రవం. (dish washing liquid)

విధానం : 1. పాత్రలోకి 0.5 సెం. మీ మందం వరకూ పాలను తీసుకో. 2. దీనికి కొన్ని చుక్కల హార రంజనాన్ని కలుపు. పరిశీలిస్తూ ఉండు. (నిదానం చాలా అవసరం) నీ పరిశీలనను ఒక పుస్తకంలో రాయి. 3. తరువాత డిష్ వాషింగ్ లిక్విడ్‌ని తీసికొని ఒక పెద్ద బిందువు పాత్రలో కేంద్రం దగ్గర పడేలా వేయి. పరిశీలిస్తూ ఉండు. నీ పరిశీలనను నీస్వంత వాక్యాలతో వర్ణిస్తూ పుస్తకంలో రాయి. 4. వేరొక పాత్రలోకి నీటిని తీసుకొని దానికి కొన్ని చుక్కల ఆహార రంజనాన్ని కలుపు. పరిశీలించు, పాలకి రంజనానిని కలిపినప్పుడు నీవుచేసిన పరిశీలను దీనితో పోల్చు.

## చీజ్ (Cheese)

పొద్దున్నే లేచి పళ్లుతోముకొన్నాక, పరగడుపున తింటే వెంటనే శక్తిని ఇచ్చే ఆహారం - చీజ్ రాసిన బ్రెడ్ ముక్కలు; గ్లాసుడు పాలు. అతి సులువుగా అయిపోయే బలవర్ధకమైన బ్రేక్ ఫాస్ట్ ఇది.

పాల నుండి చీజ్‌ను తయారు చేయడం మనిషి ఎప్పుడు ఎన్ని వందల సంవత్సరాల క్రితం నేర్చాడో చెప్పటం కష్టం కానీ, చీజ్ చాలా పురాతనమైన ఆహార పదార్థం అని మాత్రం రూఢిగా చెప్పవచ్చు.

వంట ఇంటిలో చీజ్ తయారు చేసుకోవడం : ప్రయోగం : 2

పాలను ఒక గిన్నెలోకి తీసుకొని దానిని నీరు కాచే మరొక పెద్ద గిన్నెలోని నీటిలో ఉంచి (కుక్కర్ మూత లేకుండా) పొయ్యి మీద పెట్టు. నీటి ఉష్ణోగ్రత 32 నుండి 38°C వచ్చేంత వరకూ వేడిచేయి. ఇంతకంటే నీటి ఉష్ణోగ్రత పెరగకుండా జాగ్రత్తపడు. ఈ వేడి నీటిలోని పాలగిన్నెలోని పాలు నిదానంగా కాగుతాయి. ఇప్పుడు ఒక పెద్ద చెంచాడు (table spoon) వినిగర్‌ను పాలలో వేయి.

వినిగర్‌లో ఎసిటిక్ ఆమ్లం ఉంటుంది. దీనివల్ల పాలలో ఉన్న ప్రోటీన్ భాగమంతా పెరుగుకుదపలాగా వేరు పడిపోతుంది. పాలలోని మిగిలిన భాగం ద్రవరూపంగా ఈ కుదపపైన చేరుతుంది. ఇలా జరిగితే మనం ''పాలు విరిగి పోయాయి'' - అని అంటాము. పెరుగుకుదపనే చీజ్ 'cheese' అంటాము. దీనిలో ప్రధానంగా ప్రోటీన్‌లైన కేసిన్ (caseins) ఉంటాయి. చీజ్‌పైన చేరిన నీళ్ల లాంటి ద్రవాన్ని 'వే' (whey) అంటారు. వడపోసి చీజ్‌ని ఈ నీళ్లనుండి వేరు చేయి.

ఆమ్ల చర్యవల్ల వచ్చిన ఈ పాల విరుగుని acid casein 'ఆమ్లకేసిన్' అంటారు. ఇది ముద్దలా స్నిగ్ధంగా ఉంటుంది. నిజానికి ఇది ఒక ప్లాస్టిక్ పదార్థం. సహజ ప్లాస్టిక్ పదార్థమైన దీనిని బొత్తములు తయారీలో వాడేవారు. అయితే ఈ ప్లాస్టిక్ అంత దృఢమైనది కాదు.

ఇలా తయారు చేసిన చీజ్ తినడానికి బాగుండదు. ఎందుకంటే దీనికి వినిగర్ వాసన పట్టుకొంటుంది. ఈ వాసనను ఇష్టపడేవారు దీనిని తినవచ్చు.

చీజ్‌వ్యాపారస్థులు పాలనుండి కేసిన్‌ని వేరు చేయడానికి ఎన్‌జైమ్‌లను వాడుతారు. వారు ఎక్కువగా రినిన్ (rennin) ఎన్‌జైమ్‌ని వాడుతారు. ఆవుదూడలు, గెదెపెయ్యలు, గొర్రెపిల్లలు, మేకపిల్లలు వంటి పసి పశువుల కడుపులోని జఠర రసంలో (gastric juice) ఈ ఎన్‌జైమ్ ఉంటుంది. ఈ పసికూనలు తల్లిపాలను అరిగించుకోవడానికి ఈ ఎన్‌జైమ్ దోహద పడుతుంది. చీజ్‌వ్యాపారస్థులు పాలను విరిచిన తరువాత వచ్చిన పెరుగుకుదపలోని చీజ్ ముక్కలుగా రూపొందించి ఆకర్షణీయమైన పాకెట్‌లలో చేర్చి అమ్ముతారు. చీజ్ తయారీలో ఈ వ్యాపారస్థులకు లాక్టోజ్ అనుజనితంగా (by product) లభిస్తుంది.

దీనిని విరిగించిన పాలనుండి వేరు చేయగా వచ్చిన whey (నీళ్లు) నుండి తీస్తారు. ఈ నీళ్లను ఇగిరిస్తే లాక్టోజ్‌స్ఫటికాలు వస్తాయి. ఇది కూడా కేన్‌సుగర్‌లా తెల్లగానే ఉంటుంది. నీళ్లల్లో కరుగుతుంది కానీ సుక్రోజ్ కన్నా తీపి తక్కువ, రక రకాల పంచదారల తీయదనాలను పోలిస్తే, సుక్రోజ్ 100, లాక్టోజ్ 16, మాల్టోజ్ 33, గ్లూకోజ్ 74, ఫ్రక్టోజ్ 173 గా ఉంటాయి. పాలకి సహజంగానే తీయదనం ఉండటానికి కారణం లాక్టోజ్. ఇది అన్ని రకాల జంతువుల పాలలోనూ ఉంటుంది.

బ్యాక్టీరియాని కూడా పాలనుండి casein ని వేరు చేయడానికి వాడుకోవచ్చు. బ్యాక్టీరియాతో పాలను విరిచినప్పుడు చీజ్‌తోపాటు ల్యాక్టిక్ ఆమ్లం (lactic acid) అనుజనితంగా (by product) విడుదల అవుతూ ఉంటుంది. చర్యా పాత్రలోని పదార్థాల ఆమ్లత్వం (acidity)లో అతి నెమ్మదిగా, ఒక క్రమ పద్ధతిలో మార్పు వస్తూ ఉంటుంది. అందువల్ల చీజ్‌తో పాటు మజ్జిగ కూడా తయారవుతుంది. ఈ మజ్జిగనే Yogurt (యోగర్ట్) అంటారు.

ఇటువంటి రసాయనమార్పులు చీజ్ తయారయ్యేటప్పుడు జరుగుతూ ఉంటాయి. కాబట్టే మనకి చీజ్‌లు రకరకాల రుచులలో, వాసనలలో రంగులలో దొరుకుతాయి. పాలలో ఉన్న కొవ్వు పదార్థాలలో, ప్రోటీన్‌లలో, కార్బొహైడ్రేట్‌లలో జరిగే రసాయన మార్పులను బట్టి చీజ్‌కి పట్టే వాసన ఆధారపడుతుంది. ఈ రసాయన మార్పులలో ఏర్పడే రసాయన సమ్మేళనాలను, రసాయన విశ్లేషకులు

విశ్లేషించి చూసి అవి ఏమిటో చాలావరకు చెప్పగలిగారు. Limberger Cheese తయారీ విధానంలో 36 రకాల రసాయన సమ్మేళనాలు ఏర్పడ్డాయనీ, ఈ చీజ్‌కి గల ప్రత్యేకమైన వాసన వాటివల్లేనని నిరూపించారు. పాలనుండి కాకుండా Limberger cheese రుచితో వాసనతో, ఉండే ఒక పదార్థాన్ని వారు ప్రయోగశాలలో కృత్రిమంగా తయారు చేసారు కూడా! అయితే మాత్రం వారు చేసిన దానిని ఎవరు తింటారు? అది ఎవరికీ అక్కరలేదు. అయినప్పటికీ పరిశోధనా ఫలితం - పరిశోధనా ఫలితమే అనిపించుకొంటుంది కదా! Goat Cheese తయారీలో (caproic acid) కాప్రోయిక్ ఆమ్లం విడుదల అవుతుంది. Goat Cheeseకి గల ప్రత్యేకమైన వాసన అనుజనితంగా ఏర్పడ్డ ఈ ఆమ్లం వల్లేనని కూడా తెలుసుకొన్నారు.

చీజ్‌కి ఉండే వాసన ఇంకా అనేక అంశాల మీద ఆధారపడుతుంది. ముఖ్యంగా తీసికొనిన పాల రకాన్ని బట్టి వాసన మారిపోతుంది. ఉదయం పాలకీ, సాయంత్రం పాలకీ తేడా ఉంటుంది. పితికిన పాలకీ (whole milk), పాకెట్ పాలకీ (skim milk) తేడా ఉంటుంది. ఆవుపాలకీ, గెదెపాలకీ, గొఱ్ఱె పాలకీ తేడా ఉంటుంది. తీసికొనిన పాలను బట్టి చీజ్ రంగు, వాసనా మారిపోతాయి. చీజ్ రంగు, వాసన, తఅచుదనం (texture) అది తయారైన ఉష్ణోగ్రత మీద కూడా ఆధారపడుతుంది. కొన్ని Cheeseలు మెత్తగా ఉంటాయి. ఉదాహరణకి Bire, Cambert అనే ఫ్రెంచ్ చీజ్‌లు మెత్తగా ఉంటాయి. మరి కొన్ని రకాల Cheeseలు గట్టిగా ఉంటాయి. 'Cheddar' చీజ్ గట్టిగా ఉంటుంది. కొన్ని Cheese రకాలు తెల్లగా ఉంటే మరికొన్ని లేత పసుపు పచ్చ రంగులో ఉంటాయి.

వంట ఇంటిలో మన ప్రమేయం లేకుండా బయట ఉష్ణోగ్రత, ఇంకా కొన్ని ఇతర తెలుసుకోలేని కారణాల వల్ల పాలు విరిగి casein వేరుపడటం జరుగుతూ ఉంటుంది. ఇలా విరిగిన పాల విరుగు రుచి ఎప్పుడూ ఒక్కలా ఉండక పోవడం వంట ఇంటిలో మెలిగే వారందరికీ అనుభవమే!

ఆవు, లేకగేదె ఈనిన వెంటనే ఒకటినుండి మూడు నాలుగు రోజుల దాకా ఇచ్చే పాలతో జున్ను చేసు కొంటాము. ఈ పాలతో జున్ను చేసుకోవడానికి ఆమ్లం, ఎన్‌జైమ్, బ్యాక్టీరియా వంటివాటి సహాయం అక్కర లేదు. ఈ పాలను జున్నుపాలు అనే అంటారు.

జున్నుపాలలో పంచదార, లేక బెల్లం పొడిని కరిగించి, ఆ తరువాత దానికి మిరియాల పొడిని (ఏలకుల పొడిని) చేర్చి ఆ పాల గిన్నెను నీటి కాగులో కాగుతున్న నీటిలో మూత పెట్టి ఉంచితే చాలు. లేదా కుక్కర్‌లోనన్నా పెట్టవచ్చు. కొద్ది సేపటిలో జున్ను తయారవుతుంది. జున్నుపై కొన్ని నీళ్లు కూడా తేలుతూ ఉంటాయి.

నాకు తెలుసున్న ఒకావిడ ఒకసారి జున్ను చేసాను తిందురుగాని రండి అంటూ గొప్పగా, అప్యాయంగా పిలిచింది. జున్ను అంటే చెవి కోసుకొనే నేను ఆమె పెట్టిన జున్నుని చూసి రుచి చూడకుండానే నిరాశ చెందాను. ఒక ముక్క కూడా తిన లేక పోయాను. ఆమె బెల్లం ముక్కలను పాలలో పడేసి, పాలగిన్నెను కుక్కర్‌లోని నీటిలో ఉంచి పొయ్యిమీద పెట్టింది. కాస్సేపయ్యాక దింపేసింది. పాలనుండి జున్ను అయితే తయారైంది కానీ అది తినేటట్టులేదు. జున్నులో బెల్లం ముక్కలు అక్కడక్కడా విడివిడిగా ఉన్నాయి. పాలతో కలిపి వేడి చేస్తున్నాను కదా, బెల్లం కరిగి పోతుందనుకొందటామె! జున్ను పాలనుండి జున్ను తయారు కావడానికి ఎంత సమయం కావాలి?, బెల్లపుముక్కలు ఆ పాలలో కరగడానికి ఎంత సమయం పట్టవచ్చునన్న విషయావగాహన ఆమెకు లేదు. బెల్లం కరగక ముందే చాలా ముందుగానే జున్ను తయారైంది. వంట ఇంటిలో ప్రయోగాలకి అవగాహన, శ్రద్ధ, ఓర్పు, నేర్పు, ఆసక్తి అవసరం. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి.

# కలలోనే ఒక మెలుకువ - ఆ మెలుకువలో ఒక కల - మాగ్రెటీ చిత్రకళ

- కాండ్రేగుల నాగేశ్వరరావు

మాగ్రెటీ వేసిన చిత్రాలను చూసిన వెంటనే ఇది ఒక సాధారణ, వాస్తవిక చిత్రమని ముందు అనిపిస్తుంది. మరు క్షణంలోనే కాదు, కాదు, ఇదొక భ్రాంతిమంతమైన చిత్రమని మనల్ని కలవరపెట్టి తికమక పెడుతుంది. అతని చిత్రాలలో మనం నిత్య జీవితంలో చూస్తున్న వ్యక్తులు, వస్తువులే ఉన్నా, అవి సహజంగా కనిపిస్తున్నా, ఎందుకో అవి ఉండవలసిన చోటులో ఉండవలసిన విధంగా మాత్రం ఉండవు. అతని ప్రతి చిత్రంలోనూ జటిలమైన ప్రశ్న వేసే నిగూఢత ఒకటి నిక్షిప్తమై ఉంటుంది. మాగ్రెటీ చిత్రకళను అర్థం చేసుకోవాలన్నా, ఆస్వాదించాలన్నా అతని కాలం నాటి వర్తమాన చిత్ర కళా చరిత్ర, శైలులు గురించి మనం ముందుగా తెలుసుకోవలసి ఉంటుంది.

రినీ మాగ్రిటీ 1898వ సంవత్సరంలో బెల్జియంలో జన్మించాడు. అతను బాల్యంలో చూసిన చిరికో అన్న చిత్రకారుని 'ప్రేమ గీతం' అనే చిత్రం అతనిపై చెరగని ముద్రవేసింది. చిత్రకళలో తానొక ఉత్కృష్ట స్థానాన్ని ఆక్రమించుకోవాలనే కోరిక కలిగింది. తన అభిరుచికి తగ్గట్టుగానే అతను బ్రసెల్స్‌లోని లలిత కళా అకాడమి నుంచి 1916లో ఉత్తీర్ణుడయినాడు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఒక వాల్‌పేపర్ కంపెనీలో పని చేశాడు. కొంతమంది ప్రఖ్యాతి గాంచిన చిత్రకారులవలే ఇతనిని కూడా దురదృష్టం వెంటాడింది. గుర్తింపు దొరకని ఆ కాలంలో అతను వ్యాపార ప్రకటనలకు రూపం దిద్దటం, ఛాయాచిత్రాలు తీయటం లాంటి పనులు చేసి జీవన రథాన్ని లాక్కొచ్చాడు. నగలకూ, బట్టలకూ డిజైనులు సమకూర్చి జీవించాడు. చాలా అయిష్టంతోనే ఈ పనులు చేసినప్పటికీ అందులో కూడా విశిష్టమయిన పేరు తెచ్చుకున్నాడు. పేరు ప్రఖ్యాతులున్న ఫాషన్ డిజైనర్లు అతని కస్టమర్లు కావటం ఒక విశేషం.

1927లో పారిస్ చేరుకున్నాడు. 1930 వరకూ పారిస్‌లో నవీన చిత్ర కళా రీతులను అభ్యసించాడు. అదే సమయంలో ఫ్రాయిడ్ సైకో ఎనాలిసిస్ అనే సిద్ధాంతం యూరోపు ఖండాన్ని ముంచెత్తి వేస్తోంది. 1917వ సంవత్సరంలో ఒకవేలం వెర్రిగా ప్రారంభమయిన డాడాయిజం 1923 నాటికి చల్లబడి తుది శ్వాస విడుస్తూ, అధివాస్తవికతకు (సర్రియలిజం)కు ఊపిరి పోసింది. అతను పూర్తిగా అధివాస్తవికతకు అంకితమయి పోయాడు. అప్పుడే జన్మించి, తప్పటడుగులు వేస్తున్న అధివాస్తవికత

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళ, సాహిత్యాలు అభిమాన విషయాలు.

శైలిని తనతో బాటు తన మాతృ దేశమైన బెల్జియంకు తీసుకు వచ్చాడు. బెల్జియంలోని అధివాస్తవిక శైలిననుసరించే ప్రముఖులలో అతను ముఖ్యుడు. ఊరందరిదీ ఒకదారైతే ఉలికి పిట్టది మరో దారి అన్నట్లుగా, ఆ రంగంలో ప్రసిద్ధులైన డాలీ, మీరో, షాగల్, మాక్స్ ఎర్నెస్టుల కంటే పూర్తి భిన్నంగా ఉండే ఒక ప్రత్యేకశైలిని అలవర్చుకున్నాడు. జేమ్స్ జాయస్ రచించిన యూలిసిస్ నవలలో కనిపించే చైతన్య స్రవంతిని ఇతని కొన్ని చిత్రాలలో చూడవచ్చు. ప్రఖ్యాత చిత్రకారుడయిన చిరికో, సైకో ఎనాలిసిస్ పితామహుడైన ఫ్రాయిడ్, అధివాస్తవికత, చైతన్యస్రవంతి అనబడే ఈ నాలుగు స్తంభాలపై నిర్మించ బడ్డ వ్యక్తిత్వం అతనిది.

అతని చిత్రాలు లాగే అతను కూడా ఎవరి అంచనాలకూ దొరకని ఊహకందని వ్యక్తి. అతనికి సాధారణ జీవన విధానం చాలా ఇష్టం. ఒంటరి తనం మరింత ఇష్టం. ఆ ఒంటరి తనంలో అతను అంతర్ముఖుడయినపుడు, స్వేచ్ఛా విహంగంలా విహరించే అతని మనస్సు తనలోని మర్మాలను వెతుక్కుంటూ అనాచ్ఛాదిత భావాలను వెలికి తెచ్చే ప్రయత్నంలో బయల్పడిన అచేతన భావ ప్రపంచంలోని బిడ్డలే అతని చిత్రాలు. ''అవయవాలు పూర్తిగా నిర్మాణం కాకుండానే శిశువు జన్మించినట్లుగా నాలోని అవగాహన పూర్తి కాకుండా నేను చిత్రాలు వేయడానికి పూనుకొన్నాను'' అని చెబుతాడు. సహజరీతిలో సాగించే అతని చిత్రాలలో మనుష్యులు, వస్తువులూ అసహజంగా, తర్కానికి విరుద్ధంగా చిత్రించబడటం అతని ప్రత్యేకత. ఇప్పుడు అతను వేసిన కొన్ని చిత్రాలను తార్కికంగా ఆవిష్కరిద్దాము.

ఈ సంచిక ముఖ చిత్రంలో సూటూ, హేటూ పెట్టుకున్న వ్యక్తి ముఖాన్ని ఒక ఆపిల్ పండు కప్పి వుంచుతుంది. అందరినీ అలరించే వేషం వేసుకున్నా ఒక పండు వెనుక ముఖం దాచుకున్న మూర్తిమత్వం లేని ఆధునిక మానవుడతను. సమకాలీన సమాజంలో తన సహజమైన ముఖాన్ని కాకుండా తీపి మాటలతో అందమైన ముసుగు వేసుకొని ప్రజలను మభ్యపరచే వ్యక్తులకు ఇది ప్రతీక. ఈ చిత్రానికి అతను పెట్టిన పేరు మనుష్య కుమారుడు (son of a man).

రెండవ అట్టపై చిత్రంలో ఇద్దరు స్త్రీ, పురుషులు తమ ముఖాలకు ముసుగు వేసుకొని చుంబిస్తుంటారు. దీని పేరు ప్రేమికులు. (Lovers) ప్రేమ గుడ్డిదనే వాదన ఇందులో కనిపిస్తుంది. ప్రేమనే ఉన్మాదంలో వాస్తవాలను గమనించలేని ప్రేమ తత్వాన్ని ఇందులో చూపిస్తాడు.

మూడవ అట్టపై చిత్రంలో చైతన్య స్రవంతి ఛాయలు చూడవచ్చు. గడచిపోయిన భూత కాలానికీ, రాబోయే భవిష్యత్ కాలానికీ మధ్య నడచే సూక్ష్మాతి సూక్ష్మమైన కాలగమనం వర్తమానం. ఈ చిత్రంలో

వర్తమాన కాలంలో గవాక్షం నుండి కనిపిస్తున్న సూర్యాస్తమయ దృశ్యం. ఆ గవాక్షం క్రిందనే ముక్కలుగా పగిలిన గవాక్షపు అద్దాలలో క్షణకాలం క్రితం గడచిన సూర్యాస్తమయం, స్మృతిలో మాత్రమే మిగిలిన, గడిచిపోయిన సంఘటన ఒకటయితే ఇప్పుడు వర్తమానంలోనూ జరుగుతున్న సంఘటన మరొకటి. క్షణం క్రితం జరిగిన ఒక ఛిద్రమయిన జ్ఞాపకాన్ని, కాలాన్ని కట్టడి చేసి ఒకే సమయంలో (Evening Falls) భూత వర్తమాన కాలాల్లో దర్శిస్తాడు.

నాల్గవ అట్టపై చిత్రం పేరు రాక్షస దినాలు (Titanic Days) ఇందులో ఒక నగ్నమయిన స్త్రీ, ఆమెపై అత్యాచారం చేస్తూ ఆమె చుట్టూ చేతులు వేసిన వ్యక్తి. అతను ఆ స్త్రీని ఆవహించిన భాగంలో, ఆ స్త్రీ శరీరంలో మాత్రమే చిత్రించ బడతాడు. ఇది అసంపూర్ణ చిత్రం కాదు. ఏది ఎంత వరకు చిత్రించాలో తెలిసిన చిత్రకళా తత్వమతనిది.

ఇతని చిత్రాలన్నిటిలోనూ అంతర్లీనమైన విషాద నేపథ్యం ఉంటుంది. దీనికి అతని తల్లి, అతని చిన్నతనంలో ఇంటిపై నుంచి దూకి చనిపోవటం ఒక కారణం కావచ్చు. బాల్యంలో ఒకనాడు ఒక పెద్ద గాలి బుడ్డ అతని ఇంటి పై కప్పు పై పడింది. తర్కానికి లొంగని భావాల చిత్రీకరణకు ఇది ప్రోధి చేసినట్లుగా విమర్శకులు భావిస్తారు. అతని ప్రతి చిత్రం సమాధానం లేని ఒక సమస్యను మన ముందుంచుతుంది, మన మనస్సుని తట్టి లేపుతుంది. కళ్ళతో కాక మనస్సుతో ఆలోచించమంటుంది. మన కళ్ళకు బంధం వేస్తుంది. ఆ చిత్రాలలోని సంక్లిష్టతను తొలగించుకుంటేగాని మనం ముందుకడు గేయలేం. బెల్జియం దేశస్తులు అతను మావాడు అని గర్వంగా చెప్పుకుంటారు. ఆ దేశంలోని అతని చిత్రాలు ప్రదర్శించని ఊరు లేదు. బెల్జియంలోనే కాక, న్యూయార్క్, పారిస్, వియన్నా, వెనిస్, ఇంగ్లండు, ఫిలడెల్ఫియాలలోని పలు ప్రదర్శనశాలలో మనం అతని చిత్రాలు చూడవచ్చు. 1967లో అతను చనిపోయినా 1987 నుంచి అతని చిత్రాలు కొద్ది మార్పులతో ఈ నాటికీ అడ్వర్‌టైజ్‌మెంట్ రంగాన్ని ముంచెత్తి వేస్తున్నాయి. అనేకమంది ఆధునిక ప్రకటనా చిత్రకారులకు అతను స్ఫూర్తి. ఏది ఏమైనా మాగ్రెటీ లాంటి చిత్రకారుడు మరొకడు లేడు. అతని ప్రత్యేకత అతనిదే. అతని చివరి చిత్రం ఒక పుస్తకం పై పేజీలు వెదుకుతూ ఖండించబడ్డ చేయి.

226th Page Quiz Answers

1. The Ozone layer 2. Skin cancer 3. China 4. India 5. The Bhopal gas tragedy 6. The Inuit. 7. Fourteen 8. Tuna. Dolphins are usually caught in tuna-fishing nets. 9. Nature 10. Yemen.

# రెండు భిన్నధోరణులు

## జిడ్డుకృష్ణమూర్తి వ్యాఖ్యానం

- అబ్బూరి ఛాయాదేవి

దూరానికి చేరుకోవాలంటే దగ్గర నుంచి ప్రారంభించాలి, ప్రపంచాన్ని విప్లవం ద్వారా మార్చాలనుకునేందుకు ముందు ఎవరిని వారు మార్చుకోవాలి, దైవాన్నో సత్యాన్నో దర్శించడానికి ముందు ఎవరి మనస్సుని వారు గమనిస్తూ దాన్ని అవగాహన చేసుకోవాలి అంటారు జిడ్డుకృష్ణమూర్తి గారు. ఆయన బోధనలు మేధావులకు తప్ప సామాన్యులకు అర్థం కావని కొందరూ, ఆయన చెప్పిన వాటిలో కొత్తగా ఏమీలేదు, ఆ ఉపనిషత్తులలో చెప్పినదే అనో, బుద్ధుడో మరెవరో చెప్పినదే అనో కొందరూ, ఆయన చెప్పేవి ఆచరణ సాధ్యం కావని కొందరూ తప్పించుకుంటూ ఉంటారు. ఆ తప్పించుకోవడం కృష్ణమూర్తిగారినీ, ఆయన బోధనల్నీ కాదు, ఎవరిని వారు, అంటే, ఎవరి మనస్సుని వారు తప్పించుకోవడమే. ఆదర్శం పేరుతునో, సత్యాన్వేషణ పేరుతోనే వర్తమానాన్ని, అంటే 'ఉన్న స్థితి' ని ఎదుర్కోకుండా తప్పించుకోవడమే.

ఒకసారి కృష్ణమూర్తిగారి ప్రసంగాన్ని విన్న తరవాత, ఒక భక్తితత్పరుడు ఆయన వద్దకు వెళ్ళాడు తన సందేహాలను తీర్చుకోవడం కోసం.

''భక్తి దేవుణ్ణి చేరుకునే మార్గంకాదా? భక్తితో చేసే త్యాగం హృదయాన్ని పవిత్రం చేయదా? భక్తి మన జీవితంలో అత్యవసరమైన భాగం కాదా?'' అని అడిగాడాయన్ను.

భక్తి అంటే ఆయన ఉద్దేశం ఏమిటని ఎదురు ప్రశ్నించారు కృష్ణమూర్తిగారు.

''అది అత్యున్నతమైన దాని పట్ల ప్రేమ, దేవుడికి ప్రతీక అయిన విగ్రహం ముందు పుష్పాన్ని సమర్పించడం. భక్తి అంటే సంపూర్ణంగా లీనం కావడం, శారీరక ప్రేమకి అతీతమైన ప్రేమ అది...'' అని సమాధానం ఇచ్చాడాయన.

కృష్ణమూర్తిగారు మళ్ళీ ప్రశ్నించారు - ''భక్తి అంటే ప్రేమా? అది మన దైనందిన జీవితాని కన్న వేరుగా ఉండేటటువంటిదా? ఒక వస్తువు పట్ల, జ్ఞానం పట్ల, సేవపట్ల, ఆచరణ పట్ల భక్తితో ఉండటం అంటే త్యాగం చేయడమా? ... ఒక పుస్తకంలోనో స్తోత్రంలోనో, ఒక భావంలోనో మైమరచి పోవడం స్వార్థరాహిత్యం అవుతుందా? ఒక విగ్రహాన్నో, మనిషినో, ఒక ప్రతీకనో ఆరాధించడం భక్తి అవుతుందా? సత్యానికి ఏదైనా ప్రతీక ఉంటుందా? ... మీ చిత్రపటమే మీరా? ... మీరు రోజూ కొన్ని గంటలసేపు భగవంతుని ధ్యానంలో గడుపుతున్నారు. అదేనా భక్తి. సామాజిక పురోగతికి తన జీవితాన్ని ధారపోసే మనిషి తన పని మీద అనురక్తితో ఉంటాడు. శత్రు వినాశానికి పథకాన్ని తయారు చేసే సైన్యాధిపతి కూడా తన పని పట్ల భక్తికలిగి ఉంటాడు. భక్తి అంటే అదేనా? దేవుడి విగ్రహమో, దేవుడి గురించిన ఆలోచనో కలిగించే మత్తులో మీరు మీ సమయాన్ని గడుపుతున్నారు. ఇతరులు అదేపని వేరే పద్ధతిలో చేస్తున్నారు. ఈ రెండింటి మధ్యా మౌలికమైన భేదం ఉందా? ఏదైనా లక్ష్యం ఉన్నప్పుడు అది భక్తి అవుతుందా?''

---

అబ్బూరి ఛాయాదేవి, ప్రముఖ రచయిత్రి, స్త్రీవాది, హైదరాబాద్.

కృష్ణమూర్తిగారి ప్రశ్నలు ఆ భక్తి తత్పరుడికి ఇబ్బంది కలిగించాయి. ''నాకు సమాజంలో ఆసక్తి లేదు. నా అవసరాలు చాలా కొద్ది పాటివే. నా ఉద్రేకాలను అణచుకున్నాను. దేవుడి నీడలో నా రోజుల్ని గడుపుతున్నాను'' అన్నాడు తన్ను తాను సమర్థించుకుంటూ.

''ఆ నీడ వెనక ఏదైనా పదార్థం ఉన్నదా అని కనుక్కోవడం ముఖ్యం కాదా? భ్రమని ఆరాధించడం అంటే తన సంతృప్తిని తను పట్టుకుని ఉండటమే... ఆరాధించే వాడే ఆరాధింపబడేది. ఇంకొకరిని ఆరాధించడం అంటే తన్ను తాను ఆరాధించుకోవడమే... అటువంటి భక్తి ఒకరకమైన ఆత్మవంచన ... మనం 'ఉన్న స్థితి నుంచి పారిపోవడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తాం... 'ఉన్నస్థితి' అంటే క్షణక్షణం ఉండేది. మొత్తం ఈ ఆరాధానా ప్రక్రియనీ, మీరనుకునే దేవుడి మీద భక్తినీ అవగాహన చేసుకోవడమే 'ఉన్నస్థితి' ని తెలుసుకోవడం ... 'ఉన్నస్థితి' ని అవగాహన చేసుకోవడం ఆలోచన మీద ఆధారపడదు ... మనస్సు మౌనంగా ఉన్నప్పుడే సత్యం ఆవిష్కారమవుతుంది'' అన్నారు కృష్ణ మూర్తిగారు.

ఒక విప్లవ వాది కృష్ణమూర్తి గారిని కలుసుకుని సంభాషిస్తున్నప్పుడు, ''సంఘర్షణ ద్వారానే ఏదైనా పురోభివృద్ధి, పురోగతి సాధ్యమవుతుంది'' అన్నాడు.

''మీ ఉద్దేశంలో సంఘర్షణ అంటే ఏమిటి? సంఘర్షణ వేటి మధ్య?'' అని అడిగారు కృష్ణమూర్తిగారు.

''జరిగిన దానికీ, జరగబోయే దానికీ మధ్య ... వర్గపోరాటం, జాతీయ పోరాటం, సిద్ధాంతపరమైన సంఘర్షణ. సంఘర్షణ అంటే వైరుధ్యం. కొన్ని మౌలిక చారిత్రక సత్యాలు తెలియక పోవడం వల్ల చేసే ప్రతిఘటన. వైరుధ్యం ద్వారా అభివృద్ధి ఉంటుంది, ప్రగతి ఉంటుంది...'' అని సమాధానం ఇచ్చాడా విప్లవవాది.

''మన జీవితంలో సంఘర్షణ అత్యావసరమా? ... మనం లోపలా బయటా కూడా సంఘర్షణని ఎందుకు సహిస్తున్నాం? అవగాహనకీ, సమస్యని పరిష్కరించడానికీ సంఘర్షణ అత్యావసరమా?'' అని ప్రశ్నించి, దాన్ని పరిశీలించడం అవసరమని సూచించారు కృష్ణమూర్తిగారు.

సమాధానంగా అతను, ''సంఘర్షణ లేకుండా ఒక రకం సమాజం నుంచి మరోదానికి ప్రగతి ఎలా సాధ్యం? 'ఉన్న వాళ్ళు' తమ సంపాదనని తమంతట తాము ఎన్నటికీ వదులు కోరు. వాళ్ళ చేత బలవంతంగా చేయించాలి. ఈ సంఘర్షణ ఒక నూతన సాంఘిక వ్యవస్థనీ, ఒక నూతన జీవిత విధానాన్నీ తెస్తుంది. ఇది శాంతియుతంగా సాధ్యం కాదు. మనం హింసాత్మకంగా ఉండాలని కోరుకోక పోవచ్చు. కానీ మనం వాస్తవాన్ని ఎదుర్కోవాలి ... ప్రస్తుత సమాజానికీ దానికి విరుద్ధమైన దానికీ మధ్య ఏర్పడిన సంఘర్షణ క్రమంగా ఒక నూతన సాంఘిక వ్యవస్థని ఉత్పన్నం చేస్తుంది'' అన్నాడు. అది విని, కృష్ణమూర్తిగారు, ''ఉన్నస్థితి'కి విరుద్ధమైనది వేరేగా ఉంటుందా? విరుద్ధమైనది ఎలా ఏర్పడుతుంది? 'ఉన్న స్థితి' ని మార్పు చేయడమే కదా అది? ... ప్రస్తుత సమాజం వ్యక్తిగత ఆర్జన తత్త్వం మీద ఆధారపడి ఉంది. దానికి విరుద్ధమైనదాన్ని, (సిద్ధాంత, ప్రతి వాదాల) సమన్వయ ఫలితంగా వచ్చేదాన్ని

మీరు నూతన సమాజం అంటున్నారు. నూతన సమాజంలో, వ్యక్తిగత ఆర్జన తత్త్వానికి విరుద్ధమైన ప్రభుత్వ ఆర్జన తత్త్వం ఉంటుంది. ప్రభుత్వమే పరిపాలకులు కాబట్టి. అప్పుడు ప్రభుత్వమే ఎంతో ముఖ్యం, వ్యక్తి కాదు ... ఈ ప్రతివాదం నుంచి క్రమంగా సమన్వయం ఏర్పడి, వ్యక్తులందరూ ముఖ్యం అవుతారు. ఈ భవిష్యత్తు ఊహాజనితం, ఒక ఆదర్శం, ఆలోచనా రూపం. ఆలోచన ఎప్పుడూ స్మృతికీ, నిబద్ధతకీ ప్రతి స్పందనే, అదొక విషవలయం. ఈ సంఘర్షణని - ఆలోచన అనే పంజరంలో ఈ పోరాటాన్ని - దీన్నే మీరు ప్రగతి అంటున్నారు... మీ విప్లవం మాత్రం విప్లవం కాదు. ఒక వర్గం నుంచి మరో వర్గానికి అధికారం మారడం మాత్రమే. సమూల విప్లవం అనేది ఉంది - సంఘర్షణ కానటువంటిది, అహంకారాన్ని ప్రదర్శించే ఆలోచన పైనా, ఆదర్శాలపైనా, ఊహాలోకాలపైనా ఆధారపడనటువంటిది. దీన్ని దానిగా మార్చాలనీ, ... ఒక లక్ష్యాన్ని సాధించాలనీ ఆలోచిస్తున్నంత వరకూ ఈ మౌలిక విప్లవం సాధ్యం కాదు'' అని వ్యాఖ్యానించారు కృష్ణమూర్తిగారు.

''అటువంటి విప్లవం అసాధ్యం'' అన్నాడతను. దాన్నెలా తీసుకు రాగలమో చెప్పమన్నాడు.

''అసత్యాన్ని అసత్యంగా చూడటం ద్వారా. అసత్యంలోని నిజాన్ని చూడటం ద్వారా. మనిషికీ మనిషికీ మధ్య ఉన్న సంబంధంలో మౌలిక విప్లవం రావాలన్నది స్పష్టం ... మనిషిని మానసికంగానూ, భౌతికంగానూ ఉపయోగించుకుంటున్నంతకాలం - ఆ ఉపయోగం దేవుడి పేరుతో అయినా, ప్రభుత్వం పేరుతో అయినా, సమాజం హింస మీదే ఆధారపడి ఉంటుంది. ఒక ప్రయోజనం కోసం మనిషిని ఉపయోగించుకోవడం రాజకీయవేత్తా, మత గురువూ పన్నే కుయుక్తి. అది మనుషుల మధ్య సంబంధం లేకుండా చేస్తుంది ... ఉపయోగించుకోవడం వేరు చేసే ప్రక్రియ. ఈ వేరు చేసే ప్రక్రియే మనిషికీ మనిషికీ మధ్య సంఘర్షణనీ, వైరుధ్యాన్నీ పెంచుతుంది'' అని వ్యాఖ్యానించారు కృష్ణమూర్తిగారు.

మనుషులు పరస్పరం ఉపయోగించుకోవడమే దోపిడికి దారి తీస్తోందన్న సత్యాన్ని మనం అవగాహన చేసుకోవాలి. కేవలం డబ్బూ, అధికారం ఉన్నవాళ్ళే ఇతరుల్ని దోపిడి చేస్తున్నారనుకోవడం నిజం కాదు. ప్రతి ఒక్కరూ ఇంకొకరిని ఏదో విధంగా - ప్రేమతోనో, సంప్రదాయం పేరుతోనో, భక్తి పేరుతోనో, స్వలాభం కోసం ఉపయోగించుకుంటూనే ఉంటారు. మన కన్న 'పై' వాళ్ళని ఒకలా చూడటం, మనకన్న 'కింది' వాళ్ళని మరొకలా చూడటం మనకి మామూలే. కృష్ణమూర్తిగారి బోధనలను దృష్టిలో పెట్టుకునే, ఎప్పుడో, 'విప్లవం తేగలవా?' అనే కవితలో రాశాను - ''మనిషికి మొక్కడం మానగలవా?'' మనిషిని తొక్కడం మానగలవా?'' అని. సర్వ మానవ సమానత్వం అనేది ఒక ఆదర్శం. అసమానత్వం వాస్తవం - అహింస ఒక ఆదర్శం, హింస వాస్తవం అయినట్లు గానే. కృష్ణ మూర్తిగారన్నట్లు, విప్లవం ముందుగా మన హృదయంలో రావాలి. 'భయం' ఎందుకు ఉంటోందో, 'భక్తి' ఎలా ఏర్పడుతోందో అవగాహన చేసుకోవాలి. అన్నిటికీ మూలమైన ఆలోచనని గమనించాలి.

(Commentaries on living : Second series - from the notebooks of J. Krishnamurti ఆధారంగా).

# ప్రపంచ సోషల్ ఫోరం ఎందుకు?

- బి. చంద్రశేఖర్

ప్రపంచీకరణ పేరు మీద ఆర్థిక వ్యవస్థలను సరళీకృతం చేసే చర్యలు గత దశాబ్ద కాలంలో వూపందుకున్నాయి. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం, విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరవడం లాంటి అనేక మౌలిక చర్యలను దశల వారీగా మూడవ ప్రపంచ దేశాలలో చేపట్టారు. ప్రపంచంలోని ఆధిపత్య ఆర్థిక శక్తుల, సంస్థల ఆదేశాల మేరకు ఈ 'సంస్కరణల'ను ముమ్మరం చేశారు. ఫలితంగా దేశీయ ఆర్థిక వ్యవస్థలు మునుపటి కంటే మరింతగా పాశ్చాత్య దేశాలకు వలసలుగా మారాయి. దేశీయ పరిశ్రమలు సంక్షోభం దిశగా ప్రయాణించగా పలు వర్గాల ప్రజలు పేదరికం అంచుకు విసిరివేయబడుతున్నారు. కొద్ది శాతం పై స్థాయి వినియోగదారులకు మాత్రం సకల సౌకర్యాలు, సంపదా లభిస్తున్నాయి. సాంస్కృతిక రంగంలో కూడా మూడవ ప్రపంచ దేశాల ఉనికికి ప్రపంచీకరణ ముప్పుగా తయారౌతోంది. జాతి - రాజ్యం పాత చింతకాయ పచ్చడి అనే వాదన ముందుకొచ్చి ప్రపంచ రాజ్యం దిశగా ప్రయాణం సాగుతోంది.

ఈ నేపథ్యంలో ప్రజలలో పెల్లుబుకుతున్న అసంతృప్తి గత నాలుగైదేళ్ళలో తీవ్ర రూపం దాల్చింది. సియాటిల్‌లో 1999లో ప్రపంచపు వాణిజ్య సంస్థ (WTO) సమావేశాలను ప్రదర్శకులు ముట్టడించి సంచలనం సృష్టించారు. ఆ తర్వాత ఏడాదిన్నర కాలం సియాటిల్ తరహా పోరాటాలు ప్రపంచ వ్యాప్తంగా పెల్లుబికాయి. ప్రపంచ ఆర్థిక నేతలు ఏ పేరిట ఎక్కడ సమావేశమైనప్పటికీ ప్రజల కోపాగ్నికి గురి కావలసి వచ్చింది. కొన్ని సమావేశాలు అందువల్ల భగ్నం అయిన పరిస్థితి నెలకొన్నది. మిలిటరీ, పోలీసు దండ ప్రయోగం సైతం ప్రదర్శకులను నిలువరించలేక పోయింది. ప్రపంచ ఆర్థిక నేతలు సమావేశమయ్యేందుకు ప్రపంచంలో ఎక్కడా కాస్తంత జాగాలేదా అని అమెరికాలోని ఒక ప్రముఖ దినపత్రిక సంపాదకీయం రాయాల్సివచ్చిందంటేనే ఎంత తీవ్ర పరిస్థితి ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు.

ఈ నిరసనకారులను మచ్చిక చేసుకొనేందుకై ప్రపంచ ఆర్థిక నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ ప్రయత్నాల నుంచి ప్రపంచ సోషల్ ఫోరం (W.S.F) పుట్టింది. ఇది పైకి ప్రపంచీకరణ వ్యతిరేకిగా కన్పించినప్పటికీ, సారాంశంలో ప్రపంచీకరణ సజావుగా సాగేందుకు ఏర్పడిందే. ప్రపంచీకరణ మంచిదేననీ, కొన్ని సవరణలు చేస్తే సరిపోతుందనీ నమ్మేవారు, క్రింది నుంచి ప్రపంచీకరణ చేయాలని చెప్పేవారు, భాగస్వామ్యయుత ప్రపంచీకరణ (Participatory Globalisation)ను ప్రవచించేవారు, అసలు ప్రపంచీకరణే వద్దని చెప్పేవాళ్ళూ ఇందులో వున్నారు.

'ప్రపంచీకరణ' కు వ్యతిరేకంగా 2001 జనవరిలో బ్రెజిల్‌లోని పోర్టో అలెగ్రె నగరంలో పెద్ద పెట్టున జన సమీకరణ జరిగింది. ప్రపంచం నలుమూలల నుండి పలు సంస్థలు, వేలాది వ్యక్తులు పాల్గొన్నారు. దాన్నే ప్రపంచ సోషల్ ఫోరం అని పిలుచుకున్నారు. ప్రపంచీకరణను ఎలా ముందుకు తీసుకెళ్ళాలనే విషయాన్నీ, బహుళజాతి కార్పొరేషన్ల సమస్యలను చర్చించేందుకు ప్రపంచ ఆర్థిక ఫోరం (WEF) స్విట్జర్లాండ్‌లో సమావేశమౌతుంది. దానికి కాస్త ముందుగా WSF సభలు జరుగుతున్నాయి. సియాటిల్

బి. చంద్రశేఖర్, ప్రసిద్ధ న్యాయవాది, మానవ హక్కుల యోద్ధ, గుంటూరు.

తరహాలో WEF సమావేశం జరిగే ప్రదేశంలో నిరసన వ్యక్తం చేయడానికి బదులుగా, ఆ సమావేశ ప్రదేశానికి సుదూరంలో బ్రెజిల్‌లోని పోర్టో అలెగ్రె నగరంలో 2001 నుంచీ WSF సభలను జరుపుతున్నారు. ఈ ఏడాది WSF వేదిక ముంబాయి నగరం.

WSF ను ఏర్పాటు చేసినప్పటినుంచీ దాని క్రియా రాహిత్యం పలువురిలో సందేహాలు రేకెత్తించింది. WSF నిర్వాహకుల ప్రవర్తన అనుమానాస్పదంగా చూడబడుతోంది. ప్రపంచీకరణకు WSF వ్యతిరేకమా కాదా? WSF ను ఎవరు, ఎలా, ఎందుకు ఏర్పరిచారు? నిర్మాణ స్వరూపం ఏమిటి? ఇది సంస్థనా లేదా అదే చెప్పుకున్నట్టు ఒక క్రమం మాత్రమేనా? నిర్ణయాలు ఎవరు తీసుకుంటున్నారు? WSF భారీ ఎత్తున నిధులు ఎలా, ఎక్కడి నుండి సేకరించుకొంటోంది? దీని దాతల, పోషకుల స్వభావమేమిటి?.... ఇలాంటి అనేకానేక ప్రశ్నలు WSF ను వెంటాడుతూ వస్తున్నాయి. ప్రతి ఏటా మరింతగా దాని నిజ స్వరూపం మరింత ప్రస్ఫుట మౌతోంది.

గత ఏడాది జనవరిలో పదికోట్ల రూపాయల బడ్జెట్‌తో ఆసియా సోషల్ ఫోరం (ASF) పేరిట హైద్రాబాద్‌లో సభలను నిర్వహించారు. ఆ సందర్భంలో దీని భాగస్వాములు ఎవరో, దీని ఆంతర్యమేమిటో తెలుగు ప్రజలకు తేట తెల్లం చేస్తూ ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ప్రపంచ ఆర్థిక శక్తుల చేతుల్లో పనిముట్టయిన WSF ను వ్యతిరేకిస్తూ, దాన్ని నిర్వహించే ఎన్జీవోలు దేశం నుంచి వెళ్ళిపోవాలని కోరుతూ కొన్ని సంస్థలు సభలు నిర్వహించాయి. నిరసన ప్రదర్శనలు చేసి ASF నిర్వాహకులను కలవరపెట్టాయి. అయినప్పటికీ, ఆంధ్రదేశంలో పేరెన్నికగన్న మేధావులు పలువురు ఈ సభల నిర్వహణలో భాగస్వాములయ్యారు.

గత సెప్టెంబర్‌లో ముంబాయిలోని 'రీసెర్చి యూనిట్ ఫర్ పొలిటికల్ ఎకానమీ' (RUPA) WSF నిజ స్వరూపాన్ని మరింతగా బహిర్గతం చేస్తూ ఒక పుస్తకాన్ని అచ్చేసింది. దాని పేరు: The Economics and Politics of the World Social Forum: Lessons for the Struggle against Globalization. (ఈ పుస్తకం తెలుగు అనువాదాన్ని 'వరల్డ్ సోషల్ ఫోరం- ఆర్థిక రాజకీయాలు' పేరిట హైదరాబాద్‌లోని పర్‌స్పెక్టివ్స్ ప్రచురించింది). WSF గురించిన మరింత సమగ్ర సమాచారాన్ని ఈ పుస్తకం ప్రజలకు అందిస్తోంది. ఇందులో WSF పై విమర్శ సాంప్రదాయ మార్క్సిస్టు దృక్పథం నుంచి రూపొందింది. దానితో విబేధాలున్నప్పటికీ, ఇది అందిస్తున్న సమాచారం WSF గురించి అవగాహన పెంపొందించుకునేందుకు బాగా పనికొస్తుంది.

సియాటిల్ తరహా నిరసనకు వ్యతిరిక్త దిశలో WSF పుట్టుకను గమనించవచ్చు. సియాటిల్ తరహా పోరాటాలు సమగ్రమైనవి కావనీ, ప్రపంచీకరణకు నిర్మాణాత్మక ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించడంలో అవి విఫలం కావడంతో WSF పుట్టిందని దాని రూపశిల్పులు వాదిస్తున్నారు. కాని, వాస్తవానికి సియాటిల్ తరహా తలనొప్పులకు ప్రపంచ పెట్టుబడి కనిపెట్టిన మందే WSF. నిరసన కారులతో చర్చలు జరిపే వుమ్మడి వేదిక కావాలనీ, తద్వారా ఆ పోరాటాలు తమని బాధించకుండా చూసుకోవచ్చనీ ప్రపంచ పెట్టుబడి నేతలు ఆశించారు. మెల్‌బోర్న్‌లో ప్రదర్శకుల దిగ్బంధంలో ప్రపంచ

ఆర్థిక ఫోరం (WSF) వ్యవస్థాపకుడు క్లాస్ ష్వాబ్ ఇలా వ్యాఖ్యానించారు - ''వ్యాపారవేత్తల, ప్రదర్శకుల మధ్య ఇక్కడ సంభాషణా వేదికను ఏర్పాటు చేస్తాను. ఆ సురక్షిత ప్రదేశంలో ఇరుపక్షాలూ ఆలోచనలను పంచుకుంటాయి''. తను నిర్వహించే ప్రతి ప్రపంచస్థాయి సభల సందర్భంలోనూ అలాంటి సమావేశాలను ఎన్జీవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం 1993 నుంచీ ఐక్యరాజ్య సమితికి ఆనవాయితీ అయింది. దానినే WSF లో అనుకరించారు. త్వర త్వరగా పావులు కదిపారు.

ఫ్రాన్స్‌కు చెందిన ఎన్జీవోల వేదిక ATTAC అధిపతి బెర్నార్డ్ కాసెన్, బ్రెజిల్ పారిశ్రామికవేత్తల నేత ఓడెడ్ గ్రాజు, ఫ్రెంచి ఎన్జీవోల సమాఖ్య అధిపతి ఫ్రాన్సిస్కో విటేకర్ 2000 ఫిబ్రవరిలో 'ప్రపంచ పౌర సమాజ కూటమి'ని ఏర్పరిచేందుకు సమావేశమయ్యారు. ఆ ఏడాది మార్చి నాటికి వారు బ్రెజిల్ వర్కర్స్ పార్టీ ( ప్రస్తుత అధికార పార్టీ) అధికారంలో వున్న రియో రాష్ట్ర ప్రభుత్వం నుంచి మద్దతు సంపాయించారు. ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధే జెనీవాలో ప్రత్యామ్నాయ ఐక్య రాజ్య సమితి సమావేశంలో ఈ విషయం చెప్పి వారి మెప్పు పొందారు. WSF స్థాపన ఆరోజే జరిగిందని ప్రపంచ బ్యాంకు వెబ్‌సైట్ పేర్కొంది. సరికొత్త దృక్కోణం వున్న పౌర సమాజ సంస్థగా WSF ను కొనియాడింది. ఆ తర్వాత వరుసగా WSF సభలు జరిగాయి. కేవలం చర్చలకు, వుపన్యాసాలకు మాత్రమే వీలున్న వేదికగా రూపు దిద్దుకొంది. WSF ఏ విషయం పైనా ఏ తీర్మానమూ చేయరాదనీ, నిర్దిష్ట నిరసన కార్యాచరణ చేపట్ట రాదనీ తనను తాను నిబంధించుకొంది. సియాటిల్ తరహా నిరసనకు భిన్నంగా ఆ నిరసనకు గురయ్యేవారు కూడా ఇందులో చక్కగా పాల్గొంటారు. ప్రపంచ బ్యాంకు, ఐ. రా. స. ప్రతినిధులు, ప్రపంచ ఆర్థిక సంస్థలను సంస్కరిస్తే చాలని చెప్పేవాళ్ళూ, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌పై అమెరికా కూటమి దురాక్రమణ యుద్ధాల్లో తమ దేశం పాల్గొనేందుకై తమ ఓటు వేసిన పలు యూరోపియన్ దేశాల పార్లమెంటు సభ్యులు, మంత్రులు WSF లో పాల్గొంటున్నారు. క్రియా రాహిత్యమే కార్యాచరణగా చేస్తున్న సంస్థ అది.

WSF వెబ్ సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం దాని భాగస్వాములలో ( ఇది WSF వుపయోగించిన పదమే) అమెరికా ఫోర్డ్ కార్ల కంపెనీ వారి ఫోర్డ్ ఫౌండేషన్, జర్మనీ విదేశాంగ శాఖ మంత్రి ఆధ్వర్యంలో నడిచే హెయిన్‌రిచ్ బోల్ ఫౌండేషన్, యూరప్‌లోని అతి పెద్ద ఫండింగ్ సంస్థలు - ఆక్స్‌ఫాం, నోవిబ్ (Novib), ఇకో (ICCO) ఉన్నాయి. బ్రెజిల్‌లోని అతి పెద్ద ఆయిల్ కంపెనీ, ప్రపంచంలోనే 20 అతి పెద్ద ఆయిల్ కంపెనీల్లో ఒకటి అయిన పెట్రో బ్రెజిలికా కంపెని కూడా WSF 'స్పాన్సర్ల'లో వుంది. WSF ఏర్పరచిన పార్లమెంటరీ సభ్యుల సమన్వయ వేదికకు యురోపియన్ యూనియన్ పార్లమెంటు నిధులు సమకూరుస్తుందంటే WSF కు దానికి మధ్య అనుబంధం ఎంతమేరకు వుందో అర్థం చేసుకోవచ్చు. WSF సభలో మీడియా సెంటర్ నిర్వహణకు నిధులిచ్చే వారి జాబితాలో యూరప్‌కు చెందిన ఐదు దేశాల ప్రభుత్వాలు ( జర్మనీ, డెన్మార్క్, ఇటలీ, నెదర్లాండ్స్, నార్వే), ఆరు ఐ.రా.స. అంగాలు ఉన్నాయి. ''వరల్డ్ సోషల్‌ఫోరం 2004 ప్రాజెక్టు'' పేరిట వెలువరించిన పత్రంలో ముంబాయి సభలకు 29.7 మిలియన్ డాలర్లు (రు. 135 కోట్లు) ఖర్చవుతుందని WSF

నిర్వాహకులు అంచనా వేశారు. ఈ నిధులన్నిటినీ పైన చెప్పుకున్న పద్ధతిలో నిర్వాహకులు సేకరిస్తారు. ఎవరికి వ్యతిరేకంగా ప్రపంచీకరణ వ్యతిరేక శక్తులు పోరాడాలో అవే WSF కు మహారాజ పోషకులు.

WSF నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలు నేరుగా అందులో పాల్గొనరాదు. (దీన్ని ముంబాయి సభల్లో కొంత సవరించారనిపిస్తోంది). అయితే రాజకీయ పార్టీల నేతలు వ్యక్తులుగా పాల్గొనవచ్చు. ఈ నిబంధను అడ్డం పెట్టుకొని WSF నిర్వాహకులు తమదాత అభీష్టాల మేరకు వ్యవహరిస్తూ వస్తున్నారు. తమకు ఇష్టమైన వారిని దొడ్డి దారిన 'వ్యక్తులు'గా ఆహ్వానిస్తున్నారు. ఇష్టం లేని వారిని (ముఖ్యంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో ముమ్మరంగా సాయుధంగా పాల్గొంటున్న వారిని) బహిష్కరిస్తూ వచ్చారు. అమెరికాకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా అధ్యక్షుడు ఫిడెల్‌కాస్ట్రోను, వెనెజులా అధ్యక్షుడు చావేజ్‌ను బ్రెజిల్ WSF సభలకు ఆహ్వానించలేదు. ఒకసారి చావేజ్ వస్తే ఆయన్ను అధికారికంగా వక్తగా పిలవలేదు. సాయుధ సంస్థలకు సభల్లో పాల్గొనే అర్హత లేదంటూనే, సైన్యాలను పెంచి పోషించే ప్రభుత్వాల్లోని ప్రముఖులకు, దురాక్రమణ యుద్ధాలకు అనుకూలంగా ఓటు వేసిన వారికి పెద్ద పీట వేశారు.

నిర్మాణ రీత్యా WSF తనొక సంస్థను కానని బుకాయిస్తుంది. సంస్థ అని చెప్పేందుకు అవసరమైన అన్ని లక్షణాలు దానికి వున్నాయి. ఆధిపత్య అధినాయకత్వం లేని నేలబారు క్రమాన్ని (Horizontal Process) అని చెప్పుకుంటుంది. దాని వల్ల తను ఒక సంస్థగా వ్యవహరించి తీర్మానాలు చేయనని చెప్తుంది. తీర్మానాలంటూ చేయాల్సి వస్తే, ప్రపంచీకరణకు పూర్తిగా వ్యతిరేకంగానో, ప్రపంచ బ్యాంకును, ప్రపంచ ద్రవ్య సంస్థ (IMF) ను రద్దు చేయాలనో, మూడవ ప్రపంచ రుణ విమోచన చేయాలనో సభల్లో తీర్మానించే 'ప్రమాదం' వుంది. నేలబారు క్రమం అని చెప్పుకోవడం కూడా దాని మంచికే. ఎందుకంటే, ఎవరు నిర్ణయాలు చేస్తున్నారో తెలిసే అవకాశం వుండదు. కొన్ని ఎన్జీవోలు, లేదా కొద్ది మంది WSF ప్రముఖులే తమ 'భాగస్వాముల' ఇష్ట సిద్ధికై నిర్ణయాలు చేసి అందరిపై రుద్దే వీలు కలుగుతుంది. నిజానికి, ఇంటర్నేషనల్ కౌన్సిల్, బ్రెజిలియన్ ఆర్గనైజింగ్ కమిటీ అనేవి నిర్ణయాలు చేస్తుంటాయి. వాటిల్లో విదేశీ నిధులు పొందే ఎన్జీవోలదే పై చేయి.

ఈ విషయాలు తెలియని ప్రజలు WSF ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయం అనే భ్రమలో వున్నారు. దాని వేపు ఆశగా చూస్తున్నారు. నోమ్ చోమ్స్కీ, అరుంధతీరాయ్ లాంటి మేధావులు సైతం WSF లో పాల్గొని ప్రోత్సహించడం వల్ల ప్రజలు మరింతగా భ్రమలకు గురౌతున్నారు. కాకపోతే ముంబాయిలో జరిగిన WSF సభల్లో అరుంధతి రాయ్ వుపన్యాసం కొంత ఊరట కలిగిస్తోంది. కేవలం చర్చలు, వుపన్యాసాలకే పరిమితం కాక సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా క్రియాశీల కార్యక్రమాన్ని చేపట్టాలని ఆమె పిలుపు నిచ్చారు. సరిగా WSF ఏం నివారించాలని ఏర్పడిందో ఆ పనే చేయడం కోసం ఆమె పిలుపునిచ్చారు. ఆ పిలుపును WSF పట్టించుకునే అవకాశాలు శూన్యం. ఏ అమెరికా కంపెనీల నైతే దేశాల నుండి తరిమి వేసేలా కార్యచరణ చేపట్టాలని ఆమె కోరిందో అదే అమెరికా కంపెనీలే ఆమె ఉపన్యాసం చెప్పిన వేదికను ఏర్పాటు చేశాయి. ఆమె మాట్లాడిన మైకుకు డబ్బు లిచ్చాయి. ఆమె పిలుపును WSF పట్టించుకుంటే ప్రపంచ ఆర్థిక నేతలు, దాతలు, మహారాజ పోషకులతో పాటు మనమూ దాని గురించి పునర్ మూల్యాంకన చేద్దాం.

*(రచనా కాలం: జనవరి 2004)*

# ''నవయుగాల బాట''గా రూపొందిన ''నార్లవారి మాట''

- రావెల సాంబశివరావు

నార్ల పత్రికా సంపాదకునిగా ప్రజలందరికీ తెలుసు, కవిగా కొందరికే తెలుసు.

''నార్లవారి మాట'' లోని పద్యాలకు మకుటం - ''వాస్తవమ్ము నార్లవారి మాట''. దీనికి ప్రేరేపణ ఎక్కడ అని పరిశీలిస్తే :

''విశ్వ కవివి నీవు వేమన యోగీంద్ర;
నిత్య సత్య మోయి నీదు వాక్కు;''

అని కన్పిస్తుంది - 382 ముక్తకాల సమాహారానికి ముగింపు పద్యంగా. అది ''నార్లవారిమాట''గా 1956లో మద్రాసు నుండి నార్ల వారు ప్రచురింప జేసారు. వెల వేసి లేదు. దానినే మార్పులు, చేర్పులతో ''నవయుగాల బాట''గా నవోదయ పబ్లిషర్సు వారు తమ 149వ ప్రచురణగా విజయవాడనుండి 1974లో ప్రచురించారు. దాని ధర అప్పుడు రు. 4-50. మకుటం ''నవయుగాల బాట నార్ల మాట''.

ముచ్చటగా మూడవ ముద్రణగా 1984లో సైంటిఫిక్ సర్వీసెస్ హైదరాబాద్ వారిచే ''నవయుగాల బాట'' గానే అదే మకుటంతో ప్రచురించబడింది. మూడవ ముద్రణ మూల్యం పాతిక రూపాయిలు.

మూడవ ముద్రణలో 'వేమన యోగీంద్రుడు' కాస్తా 'వేమన కవి చంద్రు' డయినాడు. 'దయతలచుటలు, దీవించుటలు' మాత్రం ఎందువల్లనో మార్పుకు గురికా లేదు. వేమన పట్ల వల్ల మాలిన అభిమానం అడ్డు నిలవటమే అందుకు కారణమేమో! ''మొత్తం పద్యాలన్నీ ఆయన చలువతో వ్రాసినవే'' అని నార్ల ముందు మాటలోనే చెప్పుకున్నారు కదా !

''చదువు సంధ్య లేల సంస్కృతి లేకున్న?
వ్రాతకోతలేల నీతి లేక ?
తెలివితేటలేల విలువలు లేనిచో?''

- ఈ ప్రశ్నలు నార్లతో వాస్తవాలు పలికించాయి. నవయుగాలకు బాటను వేయించాయి.

అంకితం ఇవ్వటంలోనూ మూడింటా మూడు దారులు. మొదట ముక్తసరిగా ''మా ఆవిడకు'' అన్నారు. 651 పద్యాలకు పెరిగిన ద్వితీయ ముద్రణలో ''నా విశ్వాసాలన్నింటిని కాకపోయినా, నా కష్ట సుఖాలన్నింటిని నలుబదేళ్ళుగా పూర్తిగా పంచుకుంటున్న మా ఆవిడ సులోచనకు'' అన్నారు. ఇక మూడవ ముద్రణ నాటికి మళ్ళీ నలుబదేళ్ళు అని ఎలా అంటారు? - అందుకని ''నా విశ్వాసాలన్నింటిని కాకపోయినా, నా కష్టసుఖాలన్నింటిని 1938 నుంచి పూర్తిగా పంచుకొంటున్న మా ఆవిడ సులోచనకు'' అన్నారు. ఇలా అంకితం విషయంలోనే ఒక కొత్త ముద్ర.

---

రావెల సాంబశివరావు, రిటైర్డు రిజిస్ట్రార్, నాగార్జునా యూనివర్శిటీ, గుంటూరు.

తొలి ముద్రణ పీఠికలో ఈయనకు సహకరించినవారి దాఖలాలు లేవు. మలి ముద్రణలో చెల్లా చెదురుగా ఉన్న పద్యాలను ఒక క్రమంలో పెట్టటంలో నాగళ్ళ గురుప్రసాదరావుగారు, ముద్రణ విషయంలో నండూరి రామమోహనరావుగారు తమ సహకారాన్ని అందించినట్లు తెలియవస్తూంది. మూడవ కూర్పులో అచ్చొత్తిన రెండవ కూర్పు పీఠికలో నండూరి వారి పేరు జారి పోయింది. ఇక మూడవ ప్రచురణ విషయంలో ప్రోత్సాహాన్నందించిన వారు శ్రీ ఎస్. గోపాల రావుగారు.

1956 - 1984 మధ్యకాలాన సంఘంలో మార్పులు వచ్చాయి. నార్ల చిత్తవృత్తిలో మార్పులు వచ్చాయి. వ్రాసిందేదో వ్రాసాను, ఆ మాట అలాగే ఉండి పోవాలనే మంకుపట్టు నార్లకు లేదు. నిత్యం నగిషీలు చెక్కే చక్కని, చిక్కని పనితనం ప్రతి ముద్రణలోనూ కన్పిస్తుంది. ఆ నగిషీలు -

కొన్ని భాషాపరమైనవైతే కొన్ని భావ పరమైనవి.
కొన్ని వ్యాకరణానికి సంబంధించినవైతే కొన్ని వ్యాకులపాటుకు చెందినవి.
కొన్ని అను ప్రాసలకు సంబంధించినవైతే కొన్ని అనుభవాలకు చెందినవి.
కొన్ని చిన్నయ సూరిని చిన్న బుచ్చినవైతే కొన్ని వేమనతో మమేకమైనవి.

ఇదంతా నార్లకు తెలియని విషయమేం కాదు. తమ రెండవ కూర్పు పీఠికలో చురకలు వేయనే వేసారు : ''ఒక్కొక్కయేడు పైబడిన కొద్దీ నార్లకు మతి మరింతగా చెడుతున్నది' అని కొందరు నా కొత్త పద్యాలను నిరసిస్తున్నట్లు నాకు తెలుసు. నేను మాత్రం దీన్ని నిరసనగా భావించటం లేదు, ప్రశంసగానే పరిగ్రహిస్తున్నాను.''

ఇక మూడవ కూర్పు పీఠికలో యింకా స్పష్టం చేసిందేమంటే - ''ఈనాడు నేను వ్రాసింది రేపటికే నాకు అసంతృప్తిని కలిగిస్తుంది. అందువల్ల నేను వ్రాసిన దానిలో కనీసం నూటికి ముప్పది వంతులనైనా పుస్తక రూపంలో ప్రచురించను. ప్రస్తుతం మనకు శతాధిక గ్రంథకర్తలు ఎందరో వున్నారు. వారి కోవకు చెందగల శక్తి సామర్థ్యాలు నాకు లేవు. ఈ పద్యాల సంఖ్యను వెయ్యి వరకు పెంచడమైనా నాకు సాధ్యం కాక పోవచ్చు.'' ఈ కూర్పులోని పద్యాల సంఖ్య 727.

ఏ మార్పుల కారణంగా అయితేనేమి మొదటి కూర్పుకూ, మూడవ కూర్పుకూ మధ్య మూడు వందల పై చిలుకు పద్యాలలో మార్పు సంభవించింది. అవి యడాగమానికీ, విసంధికీ, గసడదవాదేశానికీ సంబంధించిన స్వల్ప మార్పులూ కావచ్చు; భావానుగుణంగా మొత్తం పద్యాన్నే మార్చి వేసిన మార్పూ కావచ్చు. వేమన శైలికి దగ్గరగా వుండేందుకు ''పోవురా!'', ''సాటిరా'', ''కాదురా'', ''లేదయా'', ''పుట్టెరా'', ''మిథ్యరా'' వంటి మాటలూ చోటు చేసుకున్నాయి ఆ మార్పులో భాగంగా.

ఈ విశాల ధాత్రిలో ఏ ఒక్కడు దాస్య బాధలో చిక్కుకుని వున్నా స్వేచ్ఛానురక్తులు విశ్రమింప లేరు అని తొలిగా తమని తాము ఆవిష్కరించుకొన్న నార్ల ''విశ్రమింపరాదు స్వేచ్ఛాను రక్తులు'' అంటూ ఉద్బోధించి ఉద్యమ స్వరూపమిస్తారు తరువాత, తరువాత తమ ఆలోచనలకు, స్వేచ్ఛకు చేవ కావాలంటారు; స్వేచ్ఛలేని సుఖం తుచ్ఛమంటారు.

సర్వ జన సమాదరణం సమతగా భావించారు తొలుత. సర్వజనులపట్ల సమదృష్టియే సమతగా దిద్దుకున్నారు తరువాత.

''రాజు పోయే, అతని రాణువ పోయెను;
నంబిపోయె, అతని చెంబు పోయె
సార్వభౌముడయ్యె సామాన్య పౌరుడు'' అనే తమ తొలి భావాలు ఆచరణకు నోచుకోలేదన్న సత్యాన్ని గ్రహించిన నార్ల -

''రాజుతోడ అతని రాణువ పోయినా
నంబిమిగిలె, అతని చెంబు మిగిలె;
సగము సగము మార్పు సొంతము చెఱుపురా!'' అంటూ హితోపదేశం గావించారు.

పదవి తెచ్చే ఘనత పదవితోనే పోతుందని చెప్తూ - ''స్వామిలేని గుడిని సాగిల బడుదురా'' అనే సామ్యాన్ని తొలిగా చెప్పి తరువాత దానిని ''చేపులేని గోవు చెంత కెవ్వడు పోవు'' అంటూ వ్యంగ్యపు గుమ్మపాలు పంచుతారు. అలాగే ''మంత్రి పదవిలోనె మాన్యత లేదోయి!'' అని మొదట నచ్చ జెప్పజూచి, పిదప ఆ మంత్రి పదవి ''లక్షలు గడియింప లైసెన్సు కాదురా!'' అంటూ హెచ్చరికలు చేస్తారు.

''మొప్పెకేల రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి'' అనే దానిని ''ముఖ్యమంత్రి పదవి మూర్ఖుని కేలరా?'' అని మార్చటంతో ఎంత కమ్మికగా వుందో చూడండి.

''క్రూరుడౌను నరుడు కులతత్త్వమున్నచో'' అనే దానిని ''కుల పిశాచి రక్తబలిగోరు చుండురా!'' అని సవరించటంతో కులతత్వం పిశాచంగా పరిణామం చెందిన వైనం వుంది.

మన జాతికి పాత చింతకాయ పచ్చడిపై మోజు. ఆ తీరని మోజును ఎత్తి చూపుతూ ''పథ్య మడుగుజాతి పరిపుష్టియే పాటి!'' అని ప్రశ్నించి ప్రయోజనం లేదని గమనించారేమో - ''పథ్యము తిను జాతి పసలేమి చూపురా!'' అంటూ పకపకా నవ్వారు. అవును ఆరిన దివిటీలు దారిని చూపగలవా?!

సత్యమెంత గొప్పదైనా గుడ్డిగా నమ్మకూడదనే సత్యాన్ని విప్పి చెప్పే దొడ్డ గుణం నార్లది. అసలు ఆలోచన అనేది వుంటే అవకతవకల్ని అర్థం చేసుకునే శక్తినిస్తుంది అనే తమ భావన వెంటనే అందరికీ అందుతుందో లేదోనని ''గుడ్డి నమ్మకాలు గొడ్డుకే తగునురా'' అంటూ మనలోని గొర్రె దాటుడు తత్వాన్ని గేలిచేస్తారు. హేళనతో హేతు వాదుల గొంతు నొక్క జూచే తిక్కమూక తర్క హీనత రోగానికి, హేళననే మందుగా మార్చి, రోగం తక్కున కుదుర్చుతారు.

''బుద్ధ దేవడౌండు'', ''బుద్ధబోధలౌండు''గా మారి తిరిగి అది ''బుద్ధుని పథమొండు''గా రూపాంతరం చెందటంలోని పరిపక్వతను ప్రాజ్ఞులకు పనిగట్టుకొని చెప్పవలసిన పని లేదు కదా.

''స్వేచ్ఛమెలగి యతడు సిద్ధార్థుడయ్యెరా !''
''స్వేచ్ఛ చూపి అతడు సిద్ధార్థడయ్యెరా !''
''స్వేచ్ఛ జూపువాడె సిద్ధార్థుడౌనురా!'' అనే క్రమపరిణతీ అటువంటి కోవకు చెందిందే కదా.

''కలలనుండి పుట్టు కవితా స్రవంతులు'' అని తొలిగా భావించిన నార్ల ఎందువల్లనో అలవాటు లేని పనికి పూనుకొని అమృతం రుచి చూపించారు. ''కలలు లేక దివ్య కవితా మృతము

లేదు'' అంటూ. వ్యవహారం అక్కడే ఆగలేదు. ''అన్నమెందుకోయి అమృతమే నీకున్న'' అనే వరకు నడిచింది. ఇష్టులెవరైనా మాటల మత్తులో అలా అమృతాన్ని చిప్పిల్లజేసే సారమో చాపకింద నీరులా! ఎందువల్లనంటే పరానికి చెందిన భావాలనే కాదు పదాలను సైతం వేరే చోట్ల ఆయన మార్చి వేసిన దాఖలాలు మనకు కన్పిస్తాయి కదా!

ఆత్మ గౌరవం అడుగంటి పోయిన వ్యక్తి పువ్వు ఊడిన కాడవలె విలువలేని వాడని భావించిన నార్లకు మరో మంచి సామ్యం గుర్తుకు వచ్చి ''ఎట్టులున్ననేమి వట్టి పోయిన బావి'' అంటూ సుందర సమన్వయాన్ని సమకూరుస్తారు. అలాగే ''భయము నిలుచుచోట జయలక్ష్మి నిలువదు'' అనే వాక్యంలోని రసలుప్తతను గ్రహించి ''భయములేని వాని జయలక్ష్మి వలచురా'' అంటూ వలపుల జంటను మనముందుంచుతారు. అదే విధంగా ''ఆతడిపుడు చేతనణ్వస్త్రముల బట్టు'' అనే దానిని ''ఆది నరుడు నేడు అణ్వస్త్రధారిరా'' అంటూ సవరించి హింసను యుద్ధం ద్వారా ప్రోత్సహించే వారి ఆటవికతను బట్ట బయలు చేస్తారు.

ఆత్మ హత్యకు ఒడిగట్టేవారికి మేలు కొలుపులు పాడే సందర్భంగా ఆయన పద్యాలలోని మార్పు యొక్క నేర్పు శ్లాఘనీయం :

''చచ్చి పోవనొక్క క్షణమైన పట్టదు;
కష ్టమెల్ల బ్రతుకు గడపుటందె;
భీరుడయ్యు చచ్చు; ధీరుడే బ్రతుకురా!'' అనే పద్యాన్ని ఈ క్రింది విధంగా మార్చటంలో ఎంతటి నేర్పును ప్రదర్శించారు:

''చచ్చిపోవ ఒక్క క్షణమైన పట్టదు;
బ్రతుకుటందె కలదు పౌరుషమ్ము;
భీరుడిట్టె చచ్చు; ధీరుడే బ్రతుకురా'' అని తెలిస్తే అసలెవరైనా ఆత్మహత్యకు పూనుకుంటారా?

అలాగే సామెతలను దిద్ది నగిషీలు చెక్కి నాగరికత పుట్టుక ఎరుక పరుస్తారు.

''నిలిచి నీళ్ళు త్రాగ నీళ్ళు కాఱు బ్రతుకు
పరుగు పెట్టు వారె పాలు త్రాగు
నాగరికత పుట్టె నరుని పరుగు నుండి'' అంటూ దానిని కరతలామలకం చేస్తారు.

కక్షలు తెగపెంచి కుక్షిని నింపుకునే విషయంలో చేసిన మార్పు చాలా సమంజసంగా ఉంది. మొదట పొరపాటుగా పడుపు వృత్తితో దానికి సాపత్యం చూపినా తరువాత దానిని నక్క బ్రతుకు కంటె నాసిగా తేల్చి ''మైత్రి పెంచు బ్రతుకే మహితంపు బ్రతుకురా!'' అంటూ మానవత్వాన్ని పంచుతారు.

తప్పుత్రోవలు పట్టే మగనితో పాతివ్రత్యం ముసుగులో బతుకులు మసి చేసుకోకుండా తగవాడే భార్యల పాత్రను వివరిస్తూ ''గంగిగోవుకంటె గయ్యాళి మేలురా!'' అంటూ గడుసుదనం ప్రదర్శించి చివరకు -

''నరుడు లేక నారి పరిపూర్ణ కాలేదు;
నారి లేక నరుడు దారి తప్పు;
నూరు కలల పంట నారీ నరుల జంట'' అంటూ చక్కటి దాంపత్యానికి దారులు చూపుతారు. మనసిచ్చే మగడుంటే నగలెందుకని నచ్చజెపుతారు.

''మదరుగోడపైన కుదురుగా గూర్చుండి
గెల్చుచున్న వైపు గెంతువాడు'' కాదు యీ కవి. నరుని దురవస్థ ఈయన కంటిపైకి కునుకును రానివ్వదు. ఎదల నేలే ఈ కవికి బెదురు లేదు. ఈయనదంతా కాలానికి ఎదురీతే. అయినా ఈ కవి ఎంతటి హృదయోపాసకుడో -

''గుడులు నూరు ఒక్క గుటకగంజికి సాటి
గుడులు వేయి ఒక్క బడికి సాటి
గుడులు లక్ష ఒక్క గుండె కాయకు సాటి'' అనగలవాడు.

మొదటి కూర్పు నుండి మూడవ కూర్పు వరకూ అసలు మార్పులూ, చేర్పులూ కొంచెం కూడా జరగని పద్యాలు 116 వరకూ ఉన్నాయి! వాటిలో ''ప్రతిఘటించు శక్తి పల్చబడిన జాతి/స్వేచ్ఛగోలు పోవు శీఘ్రగతిన'' అని చెప్పటం జరిగింది. అయితే ప్రగతికోసం రక్తపాతాన్ని ఆహ్వానించరు; శాంతియుత విప్లవాన్ని కోరుకుంటారు. సోషలిజానికి శోభను సమకూరుస్తారు. గుడ్డి నమ్మకాల నడ్డిని విరగదన్నే వెట్టిగా మిగిలిపోయారు! అందువల్లనే ''చరిత యనగ సకల నరజాతి ప్రగతిరా'' అని చాటుతూ మానవాళి ముక్తిని కోరే మహితునిగా మనసున్న వారి మనసులలో నిలిచి పోతారు.

''కావ్య మొకటి చాలు కలకాలమున్నచో;
పద్యమొకటి చాలు బ్రతికనేని;
పాద మొకటి చాలు పస గలదైనచో''

అందువల్లనే పత్రికల ద్వారా ప్రజకు రక్షణ కల్పించాలనుకొన్న సంపాదకుడైన నార్ల అంతకు ముందూ, ఆ తర్వాత కూడ పద్యాలపై మనసును చంపుకోలేదు. తన కవిత్వం పస గలది కావటంకోసమే, అది సవ్యంగా బ్రతకటం కోసమే, అది కలకాలం నిలవటంకోసమే అన్నన్ని మార్పులూ చేర్పులున్నా, ఏ మార్పూ చేర్పూ లేని పద్యాలకు కూడ మకుటంలో మార్పు ఉండనే ఉంది!

నార్లవారి కవితకు కేంద్ర బిందువు నరుడు. ఈయన దృష్టిలో - ''నరుడు లేని నాడు హరి హరాదులు లేరు.''

''నరుని వృద్ధి విడిచి చరమ లక్ష్యము లేదు
నరుని జగతి విడిచి పరము లేదు.
నరుని విడిచి వేరె నారాయణుడు లేడు.''

ఇలా మానవతా పథాన్ని మనకు అందించిన ఈ పద్యాలలోని పరిణతిని మరింత దగ్గరగా సరిపోల్చుతూ అచ్చొత్తించే అవకాశాన్ని ఎవ్వరూ జారవిడుచుకోరాదు. ''వేమన్న మార్గానికి మెరుగులు పెట్టింది'' నార్ల రచన అనే రాళ్ళపల్లి వారి మాటను అటుంచితే - వేమన్న తన కవితకు తాను మెరుగులు దిద్దుకోలేదు. నార్ల తమ కవితలకు తామే మెరుగులు దిద్దుకోగలిగారు. ఆ సౌలభ్యం ఆయన కాలాన లేదు. ఈయన కాలానికి ఇలా అందుబాటులో కొచ్చింది.

# సమసమాజంలో మానవాత్మ

మూలం : ఆస్కార్ వైల్డ్ అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

(ఏప్రిల్ సంచిక తరువాయి)

పూర్వపు రోజులలో కీళ్ళను లాగి వేసే యంత్రం వుండేది. నేడు పత్రికలున్నాయి. ఇది తప్పక అభివృద్ధే. అయినప్పటికీ ఇది చాలా చెడ్డది. దోషమూ నీతిని పోగొట్టేది. ఒకాయన - బర్క్ ఆ?* పత్రికలని రాష్ట్రములోని నాల్గవ వర్గమన్నాడు.** అప్పుడది సబబు నిజమే. కానీ ఈనాడు నాల్గవ దొక్కటే పరిపాలిస్తూ ఉంది. మిగత మూటిని ఇది మ్రింగివేసింది. రాజ్యసభలోనివారు ఏమీ అనరు. మతాధికారుల కనుటకు ఏమీలేదు. లోకసభవారికి అనుటకు ఏమీ ఉండకున్నా అంటుంటారు. మనమీద పత్రికలదే పెత్తనం. అమెరికాలో అధ్యక్షుడు నాల్గేండ్లు అధికార పదవిలో ఉంటాడు. పత్రికలు మాత్రం ఎడతెగకుండ ఎల్లబడి సాగిస్తుంటాయి. అమెరికాలోని పత్రికలు తమ పెత్తనాన్ని అతిహీనమైన, క్రూరమైన పరిధులకు గొంపోవడం మేలే అయింది. పర్యవసానంగా, దీనికి తిరుగుబాటు ధోరణి తలెత్తింది. ఇప్పుడు పత్రికలంటే ప్రజలకి వినోదమైనా, వేసరికైనా కల్గవచ్చు. అయితే పత్రిక లానాటివలె ఒక బలవత్తర శక్తి కాదు. వీటి నెవరూ సరకు గొనరు. ఇంగ్లాండులో, అంతటి ఘోరాలకి పాల్పడకున్ననూ, పత్రికలింకనూ శక్తివంతాలుగా ఉంటున్నాయి. ప్రజల వ్యక్తిగత జీవితాల మీద ఇవి సాగిస్తున్న నిరంకుశత్వం, నాకసాధారణమనిపిస్తుంది. తెలిసికొనవలసింది తప్ప మిగతా దానినంత తెలిసికొనవలెనని ప్రజలకు ఎనలేని ఆపేక్ష అనేది నిజం. పత్రికలకీ విషయం తెలుసు. వ్యాపార సరళిలో ఈ గిరాకీ కి సరఫరాచేస్తారు. గత శతాబ్దలలో పాత్రికేయులను గొట్టాలకు చెవి యొగ్గి యుండునట్లు చేసి యుండింది ప్రజానీకం. ఇది చాలా అసహ్యం. నేడు పాత్రికేయులు తలుపు సందులలో తమ చెవిని ఒగ్గుతుంటారు. ఇది అంతకంటె అధ్వాన్నం. పరిస్థితిని రెచ్చగొట్టే విషయమేమంటే దర్జా పత్రికలకి వ్రాసే హాస్య రచయితల నవ్వలసిన పనిలేకపోవడం. హాని అంతా గంభీరంగా, భావస్ఫోరకంగా, చిత్తశుద్ధితో వ్రాసే పాత్రికేయులవల్లనే కలుగుతుంది. వీళ్ల రాజనీతిజ్ఞునిదో, రాజకీయ పక్ష నాయకునిదో అయిన వ్యక్తిగత జీవితంలోని ఒక సంఘటనను ప్రజల దృష్టికి లాగుతారు. ఆ సంఘటను చర్చించుడనీ, తమ పలుకుబడిని ఉపయోగించుడనీ, తమ అభిప్రాయముల వెలిబుచ్చుడని అనడమే కాక వాటిని ఆచరణలో పెట్టండనీ, ఆయననీ, ఆయన పక్షాన్నీ, ఆయన దేశాన్నీ శాసించుమని ప్రజలని ఆహ్వానిస్తారు. అనగా ప్రజలను హాస్య భాజనులుగా, అసహ్యులుగా, హానికరులుగా కండి అని ఆహ్వానిస్తారు. స్త్రీ, పురుషుల వ్యక్తిగత జీవితం బహిర్గతం చేయరాదు. ప్రజలకావిషయంతో ఏ సంబంధమూ ఉండరాదు.

ఫ్రాన్సులో ఇటువంటి విషయాలను బాగా సంభాళించుకొంటారు. అచట విడాకుల న్యాయస్థానాలలో జరిగే వ్యాజ్యాల వివరాలను, ప్రజల వినోదానికో, విమర్శకో ప్రకటింపరు. ప్రజలకు

---

* ఎడ్మండ్ బర్క్

** ఇతర మూడు ఇవి: మతాధికారులు, బ్రిటిష్ పార్లమెంటులోని రాజ్యసభ, లోకసభలు

---

కీ॥ శే॥ డా॥ సర్దేశాయి తిరుమలరావు, (1928 - 1994) ప్రముఖ సాహిత్య విమర్శకులు

తెలియజెప్పేదెల్లా ఏమంటే, ఫలానా వారి అర్జీ మేరకు విడాకులు మంజూరైనదనే విషయం మాత్రమే. ఫ్రాన్సులో పాత్రికేయుణ్ణి అదుపులో పెట్టి, కళాకారునికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇస్తారు.* ఇచట** మనం పాత్రికేయునికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చి కళాకారుణ్ణి అణగ త్రొక్కుతున్నాము. అంటే ఇంగ్లీషు ప్రజాభిప్రాయం సుందర వస్తువులచేసే వానికి అడ్డంకులు పెట్టి నిరోధించి, వక్రీకరించి వికారమైన ఏహ్యం కలిగించే విషయాలని వివరంగా వర్ణించుమని పాత్రికేయుని బలవంతపెట్టుతుందన్న మాట. ఫలితంగా, మనకు ప్రపంచంలోకెల్లా గంభీరులగు పాత్రికేయులూ, అసత్యములైన వార్తా పత్రికలూ ఉన్నాయి. బలవంతం అనేమాట అతిశయోక్తికాదు. ఘోరాలను ప్రకటించేందుకు నిజంగా సరదాపడే పాత్రికేయులు కొందరుండవచ్చు. పేదరికం వల్ల కొందరు అపవాదాలు వ్రాయడమే తమ రాబడికి ఆధారం చేసికొని వుండవచ్చు. ఇటువంటి వానిని ప్రకటించేందుకిష్టపడని మరికొందరు విద్యా సంస్కారాలుగల పాత్రికేయులున్నారనేది నాకు కచ్చితంగా తెలుసు. ఇట్లు చేయుట తప్పని వీళ్ళకీ తెలుసు. అనారోగ్యకర పరిస్థితులలో సాగిపోతున్న వృత్తిలో ప్రజాభీష్టం ప్రకారం ఇతర పాత్రికేయులతో పోటీపడి ప్రజల నీచాభిరుచిని సంతృప్తి పరచే విధంగా సరఫరా చేయక తప్పిందికాదు వీరికి. విద్యావంతులకిది అవమానకరగతే. వారు కూడా ఆవిధంగానే భావిస్తున్నారనే దానిలో నాకు సందేహమేమి లేదు.

విషయంలోని హీన పార్శ్వాన్ని వదులుదాము. ప్రజల అదుపులో కళ ఉండడమనే సమస్యకు మరలుదాము. అంటే నా ఉద్దేశ్యంలో, కళాకారుడే రూపాన్ని ఉపయోగించవలెనో, ఏవిధంగా ఉపయోగించవలెనో, ఏయే వస్తువులతో పనిచేయవలెనో ప్రజాభిప్రాయం ఆదేశించడం. ఇంగ్లాండులో ప్రజాభిప్రాయాన్నుంచీ తప్పించుకొన్న కళలేవీ అని అడిగితే ప్రజలకాసక్తి లేనట్టివే అని ఇంతకు ముందే సూచించినాను. ప్రజలకి నాటకంలో ఆసక్తి ఉంది. నాటకంలో గత పది, పదిహేను సంవత్సరాలలో కొంత పురోభివృద్ధి కన్పించింది. ప్రజల అభిరుచి రాహిత్యాన్నే ప్రమాణంగా తీసుకోవడాన్నీ, కళను గిరాకీ - సరఫరా అనే వ్యాపార సరళి కొలుకుండే సరుకుగా పరిగణించడాన్ని కొందరు కళాకారులు నిరాకరించినందువల్ల ఈ పురోభివృద్ధి సాధ్యమైందని చెప్పుట ముఖ్యం. అద్భుతమూ, ప్రకాశవంతమూ అయిన వ్యక్తిత్వంతో, పటిష్టమైనశైలితో, కేవలం అనుకరణ కళలపైననే కాక, కల్పనాత్మక, ఆలోచనాత్మక సృజనమీద కూడా అధికారం గల ఇర్వింగ్ ప్రజలకేమి కావలెనో అదిచ్చేందుకు సామాన్య ఫక్కీలో అతి సామన్య నాటకాలు వ్రాసి, తనకు కావలసినంత కీర్తి, ధనమూ సంపాదించుకొనియుండేవాడు. ఆయన ఆశయం అదికాదు. కొన్ని పరిస్థితులలో కొన్ని కళారీతులలో తన కళావ్యక్తిత్వ పరిపూర్ణత సాధించుటే. ఆరంభంలో అతడు కొందరికే నచ్చినాడు. తర్వాత చాలా మందికి విజ్ఞత కలిగించినాడు. ప్రజలలో మంచి అభిరుచి చిత్తవృత్తినీ పుట్టించినాడు. ప్రజలు ఆయన కళా విజయాన్ని చాలా మెచ్చుకొంటారు. ఆయన వీరి ప్రమాణాల నంగీకరించక, స్వీయ ప్రమాణాలను సాధించినందుకే ఈ విజయం సాధ్యమయిందని ప్రజలకు తెలుసునా అని నాకాశ్చర్యం. వారి ప్రమాణాలే చెల్లుబడి

* ''మేడం బోవరీ'' అనే ప్రఖ్యాత నవల వ్రాసిన ఫ్లాబర్ట్‌ను ఫ్రెంచి ప్రభుత్వం పెట్టిన త్రిప్పలు దృష్ట్యా, వైల్డ్ చెప్పేది సరికాదనిపిస్తుంది. ఈ వ్యాసారంభంలో వైల్డ్ చే పేర్కొనబడ్డ పూర్ణమానవులలో వొకడు ఫ్లాబర్ట్

** ఇంగ్లండులో


అయితే లైసియం★ ఇప్పుడు లండనులో ఉండే కొన్ని జనరంజక నాటకశాలలవలె రెండవ తరగతి చిరుసాలగా అయివుండేది. వారి కర్థంకానీ, కాకపోనీ ప్రజలలో కొంతవరకు అభిరుచి, చిత్తవృత్తి కలిగి నాయనడం వాస్తవం. ప్రజలకీ గుణాలలవరచుకొనే శక్తి కూడా వుంది. అయితే ప్రజానీకం ఇంతకంటే ఎక్కువగా ఎందుకు నాగరికం కావడం లేదనేదే సమస్య. వారికి శక్తివుంది. వారి నాపేదేది?

ఈ మాట మరలా చెప్పవలసివుంది. కళ మీద, కళాకారుల మీద అజమాయిషీ చేయవలెననే వారి ఆకాంక్షయే వారిని ఆపుతా ఉంది. లైసియం హేమార్కెట్ అనే నాటకశాలల విషయంలో ప్రజలు సముచితాభిప్రాయం కలిగి వున్నారు. కళచే రంజింపబడే మనోధర్మాన్ని ప్రేక్షకులలో పుట్టించడంలో ఈ నాటకశాలలు కృత కృత్యాలైనాయి. ఆ మనోధర్మమేమి? రసగ్రహణ పారీణమనో ధర్మమే ఇది. అంతే.

కళ మీదా, కళాకారుని మీదా పెత్తనం చెలాయించేందుకు ఎవ్వడైనా సంకల్పిస్తే, కళాభినివేశం ఒంటబట్టని ధృక్పథంతో సంకల్పిస్తున్నాడని అర్థం. కళే ప్రేక్షకుని ఆధీనం చేసుకోవలెనోగాని ప్రేక్షకుడు కళను ఆధీనం చేసుకోరాదు. ప్రేక్షకుడు గ్రహీత, వాడు నిపుణుడు వాయించే వాయులీనంగా ఉండవలసిన వాడు. పనికి మాలిన తన అభిప్రాయాలనూ, తెలివి తక్కువ నమ్మకాలనూ, కళా ఎట్లుండవలెను, ఎట్లుండరాదు అనే విషయాలపై తన అసంబద్ధ భావాలను ఎంతపూర్తిగా అదుపులో పెట్టుకుంటే, కళాఖండాన్ని అంతగా అర్థంచేసుకోగలడు, అభినందించనూగలడు. ఇది నాటకాలు చూచేందుకు పోయే ఇంగ్లీషు అలగా జనం ఎడలా సుస్పష్టం. విద్యావంతుల విషయంలోనూ నిజమే. విద్యావంతునకున్న కళ గురించిన భావాలు ఇంతకు ముందున్న కళ నుండి సంక్రమించినట్టివి. కొత్తగా వచ్చిన కళ ఇంతకు ముందెన్నడూ ఉండని కారణాన సుందరమైనట్టిది. పాతబడిన కొలబద్దబట్టి దీనిని కొలువడం అంటే, దేనిని వర్జించడం మీద కళ యొక్క నిజమైన ఉత్కృష్టత ఆధారపడి ఉంటుందో దానిని బట్టి కొలువడమన్న మాట. కాల్పనిక పరిస్థితులలో కాల్పనిక సాధనాలద్వారా క్రొత్తవీ, అందమైనవీ అయిన అనుభూతులను పొందగలిగే చిత్తవృత్తే కళను అభినందించగల చిత్త వృత్తి. శిల్పాల, చిత్రాల మెచ్చుకొనుట యందిది ఎంతనిజమో, నాటకం వంటి కళలమెచ్చుకోలు లోనూ అంతే నిజం. చిత్రకానీ, ప్రతిమకానీ, కాలంతో కదునం చేయవు. కాలాను క్రమాన్ని సరకుగొనవు. ఒక్క చూపుతో వాని సమగ్రతను గ్రహింపవచ్చును. సాహిత్యం విషయంలో అట్లుకాదు. దాని స్వరూప సమగ్రతలు తెలిసికొనుటకు కొంత కాలవ్యవధి కావలసి యుండును. నాటకంలో మొదటి అంకంలో ఏదైనా కలుగవచ్చు. దీని కళాత్మక ఆంతర్యం మూడవ లేక నాల్గవ అంకంవచ్చే వరకూ ప్రేక్షకునికి స్పష్టం కాకపోవచ్చును. అప్పుడు అర్థంకాని నిస్సహాయుడు కోపిస్తూ కేకలు వేస్తూ నాటకానికంతరాయం కలిగించి, నటకులను కలత పెట్టవలెనా? కాదు. మర్యాదస్థుడైన మనిషి నిశ్శబ్దంగా కూర్చొని, ఆనందాన్ని కలిగించే అద్భుతాన్నీ, ఔత్సుక్యాన్నీ, ఉత్కంఠతనీ అనుభవించవలెను. అసభ్యంగా సహనాన్ని కోల్పోవుటకు కాక, కళాభినివేశాన్ని సాధించడానికి నాటకానికి పోవలెను. కళాభినివేశాన్ని సంపా దించడానికి నాటకానికి పోవలెను. ప్రేక్షకుడు కళకు తగవరి కాడు. కళను ధ్యానించుటకే వానికి ప్రవేశం ఇవ్వబడింది.


(ఇంకావుంది)

★ లండనులోని ఒక ఉన్నతశ్రేణి నాటకశాల



మునిమాపు వేళ

MISIMI/మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/2003-05



రాక్షసదినాలు (Titanic Days)